సాగునీటి సంఘాల ఎన్నికలకు జిల్లా యంత్రాంగం కసరత్తు చేస్తోంది. కలెక్టరు పి. రంజిత్‌బాషా డిసెంబరు 5న నోటిఫికేషన్ జారీ చేస్తారు. 8 నుంచి 14వ తేదీలోగా కసరత్తు పూర్తి చేసేలా షెడ్యూల్ ఖరారు చేశారు. తొమ్మిదేళ్ల తరువాత నీటి సంఘాల ఎన్నికలకు అక్టోబరు 21న కలెక్టరు నోటిఫికేషన్ జారీ చేశారు. షెడ్యూలు ప్రకారం 23న ఎన్నికలు జరగాల్సి ఉంది. అసెంబ్లీ సమావేశాల కారణంగా వాయిదా వేశారు. ప్రస్తుతం ఎన్నికల నిర్వహణకు రెండు జిల్లాల యంత్రాంగం పక్కా ప్రణాళిక సిద్ధం చేసింది. దాదాపుగా ఐదు వేల మంది సిబ్బంది ఎన్నికల విధుల్లో పాల్గొననున్నారు. కర్నూలు కలెక్టర్ పి. రంజిత్‌బాషా, నంద్యాల కలెక్టర్ రాజకుమారి పర్యవేక్షణలో ఎన్నికల నిర్వహణపై శిక్షణ ఇస్తున్నారు. ఏకగ్రీవం చేసుకోవడానికి అధికార టీడీపీ కూటమి నేతలు వ్యూహాలు రచిస్తున్నారు. పట్టు కోసం బరిలో దిగాలని వైసీపీ నాయకులు ఎత్తులు వేస్తున్నారు. దీంతో చలికాలంలోనూ పల్లెసీమల్లో నీటి సంఘాల ఎన్నికల వేడి రాజుకుంది.



నీటి సంఘాల ఎన్నికలకు సిద్ధం

- డిసెంబరు 5న నోటిఫికేషన్ జారీ
- 8న ఉమ్మడి జిల్లాలో 384 సాగు నీటి సంఘాలకు..
- 11న డిస్ట్రిబ్యూటరీ కమిటీలు, 14న ప్రాజెక్టు కమిటీల ఎన్నిక
- ఎన్నికల విధుల్లో ఐదు వేల మందికి పైగా సిబ్బంది



జలమండలి కార్యాలయం

కర్నూలు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లాలో తుంగభద్ర దిగువ కాలువ, గాజులదిన్నె ప్రాజెక్టు, టీబీపీ హెచ్చెల్సీ ఆలూరు బ్రాంచి కెనాల్, హంద్రీనీవా కాలువ, కేసీ కాలువ, రాంపురం ఛానల్ కెనాల్, నంద్యాల జిల్లాలో కేసీ కాలువ, తెలుగుగంగ, ఎస్ఆర్‌బీసీ, శివభాష్యం, మైలవరం ప్రాజెక్టులతో పాటు మైనర్ ఇరిగేషన్ చెరువులు ఉన్నాయి. ఈ నీటి వనరుల నిర్వహణకు ఉమ్మడి జిల్లాలో 384 సాగునీటి సంఘాలకు ఎన్నికలు జరగాల్సి ఉండింది. రాష్ట్ర విభజన తర్వాత 2015-16లో ఆనాటి టీడీపీ ప్రభుత్వం సాగునీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించింది. 2019 మేలో కొలువుదీరిన వైసీపీ ప్రభుత్వంలో ఎన్నికలు నిర్వహించలేదు. నీటి సంఘాలు, డిస్ట్రిబ్యూటరీ కమిటీలు, ప్రాజెక్టు కమిటీలకు అధ్యక్ష, ఉపాధ్యక్షులు, డైరెక్టర్లుగా వైసీపీ నాయకులు, సానుభూతిపరులను నామినేట్ చేసింది. మళ్లీ టీడీపీ కూటమి ప్రభుత్వం రాకతో గ్రామ సీమల్లో సాగునీటి సంఘాల్లో రైతులను భాగస్వామ్యం చేసి.. కాలువలు, డిస్ట్రిబ్యూటరీలను ఆధునికీకరించాలనే సంకల్పంతో ఎన్నికల నిర్వహణకు సై అంది. మూడు దశల్లో ఎన్నికలు ప్రక్రియ పూర్తి చేసేందుకు జిల్లా కలెక్టర్ల పర్యవేక్షణలో కసరత్తు చేస్తున్నారు. అదే క్రమంలో ఎన్నికల నిర్వహణ సిబ్బందికి శిక్షణ ఇస్తున్నారు. శుక్రవారం కర్నూలు కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో జిల్లా ఎన్నికల నిర్వహణ సిబ్బందికి శిక్షణ ఇచ్చారు.

పల్లెల్లో ఎన్నికల వేడి

కర్నూలు జిల్లాలో 123 సాగునీటి సంఘాలు, 10 డిస్ట్రిబ్యూటరీ కమిటీలు, 2 ప్రాజెక్టు కమిటీ ఎన్నికలకు జిల్లా కలెక్టర్ పి. రంజిత్‌బాషా, నంద్యాల జిల్లాలో 261 సాగునీటి సంఘాలు, 25 డిస్ట్రిబ్యూటరీ కమిటీలు, 4 ప్రాజెక్టు కమిటీల ఎన్నికలకు ఆ జిల్లా కలెక్టర్ రాజకుమారి డిసెంబరు 5న నోటిఫికేషన్ జారీ చేయనున్నారు. కర్నూలు జిల్లాలో 123 నీటి సంఘాలకు 1,212 టీసీ (ప్రాదేశిక నియోజకవర్గం) సభ్యులు, నంద్యాల జిల్లాలో 261 సాగునీటి సంఘాలకు 2,349 టీసీ సభ్యులను రైతులు ఎన్నుకుంటారు. టీసీ సభ్యులు డబ్ల్యూయూఏ అధ్యక్ష, ఉపాధ్యక్షులను ఎన్నుకుంటారు. ఉమ్మడి జిల్లాలో 35 డిస్ట్రిబ్యూటరీ కమిటీలు, 6 ప్రాజెక్టు కమిటీల అధ్యక్ష, ఉపాధ్యక్షుల ఎంపిక జరగాల్సి ఉంది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం షెడ్యూల్ విడుదల చేసింది. ఆయా సాగునీటి వనరుల కింద కర్నూలు జిల్లాలో 2,20,499.43 ఎకరాలు, నంద్యాల జిల్లాలో 45,98,190.68 ఎకరాల ఆయకట్టు ఉంది. 2015-16లో భూయాజ్యమాన్యం హక్కు కలిగిన ఆయకట్టు రైతులను ఓటర్లుగా గుర్తించి ఎన్నికలు నిర్వహించారు. తొమ్మిదేళ్ల ఎన్నికలు నిర్వహించకపోవడంతో ఈ మధ్యకాలం భూముల క్రయవిక్రయాలు, అన్నదమ్ములు విభాగాలు జరిగడంతో రెవిన్యూ రికార్డుల్లో భూయాజమాన్యం హక్కు కలిగిన రైతులు మారిపోయారు. ఇంజనీర్లు, రెవిన్యూ అధికారులు (తహసీల్దారులు) సమన్వయంతో ఆయకట్టు రైతులను గుర్తించి ఓటర్ల జాబితా తయారి కోసం ప్రత్యేక అధీకృత రెవిన్యూ అధికారులను నియమించారు. వీరు తయారు చేసే ఓటర్ల జాబితా ఆధారంగా ఎన్నికలు నిర్వహిస్తారు.

మిగతా 6లో..

మార్క్‌ఫెడ్ డీఎంల బదిలీ



హరినాథరెడ్డి

కర్నూలు అగ్రికల్చర్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కర్నూలు జిల్లా మార్క్‌ఫెడ్ సంస్థలో పని చేస్తున్న జిల్లా మేనేజర్లను బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. నంద్యాల జిల్లా మార్క్‌ఫెడ్ డీఎంగా కొనసాగుతున్న నాగరాజును అక్కడే దాణా ప్లాంట్ మేనేజర్‌గా కొనసాగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. టెక్నికల్ మండల వ్యవసాయాధికారిగా నంద్యాల జేడీ కార్యాలయంలో పని చేస్తున్న హరినాథరెడ్డిని అదే జిల్లా మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్‌గా బదిలీ చేసింది. కర్నూలు జిల్లా మేనేజర్‌గా పని చేస్తున్న రాజును కూడా మరి కొద్దిరోజుల్లో బదిలీ చేస్తున్నట్లు అధికార వర్గాలు తెలిపాయి. ప్రస్తుతం కడపలో పని చేస్తున్న పరిమళ జ్యోతి కర్నూలు జిల్లాకు రానున్నట్లు విశ్వసనీయ సమాచారం.

వాల్మీకి కార్పొరేషన్ చైర్‌పర్సన్‌గా కప్పట్రాళ్ల బొజ్జమ్మ



చైర్‌పర్సన్‌గా బాధ్యతలు చేపట్టిన కప్పట్రాళ్ల బొజ్జమ్మ

ఆలూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర వాల్మీకి కార్పొరేషన్ చైర్‌పర్సన్‌గా ఆలూరు నియోజకవర్గం దేవనకొండ మండలానికి చెందిన టీడీపీ నాయకురాలు కప్పట్రాళ్ల బొజ్జమ్మ శుక్రవారం విజయవాడలోని బీసీ భవన్‌లో బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె వాల్మీకి వర్గాలకు సంక్షేమ పథకాలు అందేలా చూస్తామన్నారు. నిరుద్యోగ యువత జీవనోపాధి కోసం రుణాలు ఇచ్చేందుకు కృషి చేస్తానని చెప్పారు. తనకు ఈ అవకాశం కల్పించిన రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రులు నారా లోకేశ్, టీజీ భారత్, ఎంపీ బస్తిపాటి నాగరాజుకు, టీడీపీ శ్రేణులకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం బొజ్జమ్మతో పాటు టీడీపీ నాయకుడు రామచంద్రనాయుడు టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు టీడీ జనార్ధన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

డిప్యూటీ కలెక్టర్ల నియామకం

కర్నూలు కలెక్టరేట్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లాకు నలుగురు డిప్యూటీ కలెక్టర్లను నియమిస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లా సమగ్ర శిక్ష ఏపీసీగా డిప్యూటీ కలెక్టర్ టి. శ్రీనివాసులు, శ్రీశైలం ప్రాజెక్టు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా టీకే వెంకటేశ్వర్లు, జీజీహెచ్ అడ్మినిస్ట్రేటర్‌గా డిప్యూటీ కలెక్టర్ సింధు సుబ్రహ్మణ్యం, హెచ్ఎన్ఎస్ఎస్ యూనిట్-3 స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా ఎం. శేషిరెడ్డి నియమితులయ్యారు.

కౌన్సిల్‌లో రచ్చ రచ్చ

- టీడీపీ, వైసీపీ సభ్యుల మధ్య వాగ్వాదం
- పోటాపోటీగా పోడియం ముందు బైఠాయింపు
- ప్రజా సమస్యలు గాలికి వదిలేసిన కౌన్సిల్ సభ్యులు

ఎమ్మిగనూరు, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం రసాభాసాగా ముగిసింది. టీడీపీ, వైసీపీ సభ్యులు పోటాపోటీగా పోడియం ముందు బైఠాయించి నినాదాలు చేయటంతో కౌన్సిల్‌లో గందరగోళం ఏర్పడింది. శుక్రవారం మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం చైర్మన్ డా. రఘు అధ్యక్షతన జరిగింది. సమావేశం ప్రారంభం కాగానే ఒకటో వార్డు కౌన్సిలర్ నాగేశప్ప మాట్లాడుతూ గత కౌన్సిల్ సమావేశంలో చైర్మన్ పట్ల టీడీపీ కౌన్సిలర్ దురుసుగా వ్యవహరించారని, ఇది సరైంది కాదని, క్షమాపణ చెప్పాలని కోరాడు. దీంతో టీడీపీ కౌన్సిపల్ దయాసాగర్‌తోపాటు ఆ పార్టీ కౌన్సిలర్లు సమాధానం ఇచేందుకు ప్రయత్నించారు. చైర్మన్ డా. రఘు కల్పించుకొని అజెండాలోని అంశాలు చదివిన తరువాత మాట్లాడాలని చెప్పడంతో టీడీపీ సభ్యులు శాంతించారు. అటు తరువాత అంజెండాలోని రెండు, మూడు అంశాలు చదువుతుండగానే వైస్ చైర్మన్ నజీర్ అహ్మద్ లేచి అజెండాలోని అంశాలను ఆమోదిస్తున్నామన్నారు. ఆ తరువాత టీడీపీ కౌన్సిలర్, ఫ్లోర్ లీడర్ దయాసాగర్ మాట్లాడుతూ గత కౌన్సిల్ సమావేశంలో ఆరో వార్డు వైసీపీ సభ్యుడు శివకుమార్ టీడీపీ మహిళా కౌన్సిలర్ల మనోభావాలు కించపరిచేలా మాట్లాడారని, ఆయన క్షమాపణ చెప్పాలని కోరారు. వైస్ చైర్మన్ నజీర్ అహ్మద్ అడ్డు తగులుతూ చైర్మన్‌ను టీడీపీ సభ్యుడే కించపరిచేలా మాట్లాడారని, ఆయన ముందు క్షమాపణ చెప్పాలని అనటంతో టీడీపీ, వైసీపీ సభ్యుల మధ్య వాగ్వాదం చెలరేగింది. చైర్మన్ రఘు ఒకరి తరువాత ఒకరు మాట్లాడాలని సర్ది చెప్పేందుకు ప్రయత్నించారు. ఆయన మాటను వైసీపీ సభ్యులు పట్టించుకోకపోగా చైర్మన్ పోడియం ముందు బైఠాయించి క్షమాపణ చెప్పాలని నినాదాలు చేశారు. దీంతో టీడీపీ సభ్యులు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేస్తూ పోడియం ముందు బైఠాయించారు.

ఇరువురు సభ్యులు పోటాపోటీగా బైఠాయించి నినాదాలు చేశారు. నినాదాలు, అరుపులతో కౌన్సిల్ సమావేశం దద్దరిల్లింది. దీంతో కౌన్సిల్ సమావేశంలో గందరగోళ పరిస్థితి ఏర్పడింది. ఎవరు ఏం మాట్లాడుతున్నారో అర్థం కాని పరిస్థితి నెలకొంది. ఇరువురిని శాంతింపజేసేందుకు చైర్మన్ డా. రఘు ప్రయత్నించినప్పటికీ ఎవరూ పట్టించుకోలేదు. పోటాపోటీగా నినాదాలు చేయటంతో చేసేదిలేక బెల్ కొట్టి సమావేశాన్ని ముగించారు. పోడియం దిగివస్తున్న చైర్మన్‌ను ఇలా ఎలా సమావేశాన్ని ముగిస్తారని ప్రశ్నించటంతో చైర్మన్ స్పందిస్తూ ఎవరు మాట వినకపోవటంతో ఏమి చేయాలి.. ఎలా కొనసాగించాలన్నారు. ఇదిలాఉంటే ప్రజా సమస్యలు గాలికొదిలేసి ఒకరిని ఒకరు విమర్శించుకోవడమే సరిపోయిందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. సమావేశంలో వైస్ చైర్మన్ దివ్యకళ, కౌన్సిలర్లు, మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి, డీఈ, ఏఈ, ఎస్ఐ, సిబ్బంది పాల్గొన్నారు.

- కౌన్సిల్ సమావేశంలో మున్సిపల్ ఫ్లోర్ లీడర్ దయాసాగర్ మాట్లాడుతూ ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి పట్టణ ప్రజలకు తాగునీరు ఇబ్బంది లేకుండా ఉండేందుకు ఏఐబీ స్కీంను తిరిగి తీసుకొచ్చారన్నారు. అలాగే శివారు కాలనీల్లో తాగునీటి పైప్‌లైన్లు వేసేందుకు రూ.2.65కోట్లు 15వ ఆర్థిక సంఘం నిధులు కేటాయించటం, టెక్స్‌టైల్ పార్కుతో పాటు ఇతర పథకాలను అసెంబ్లీలో మాట్లాడి తీసుకు రావటం పట్ల కౌన్సిల్ తరఫున కృతజ్ఞతలు తెలిపారు.
- వైస్ చైర్మన్ నజీర్ అహ్మద్ మాట్లాడుతూ పట్టణంలోని మిలటరీ కాలనీ రోడ్డును కోసిగి రోడ్డుకు కలపాలని, గోనేగండ్ల సర్కిల్‌లో ఎమ్మిగనూరు స్థల దాత హసన్ బేగ్ స్థూపం నెలకొల్పాని కోరారు. అలాగే మిలటరీ కాలనీకి వెళ్లే రోడ్డుకు మాజీ ఎమ్మెల్యే చెన్నకేవరెడ్డి పేరు పెట్టాలని కోరారు.



సమావేశంలో టీడీపీ, వైసీపీ సభ్యుల వాగ్వాదం

సకాలంలో చెరువులు నింపుతాం

జల వనరుల శాఖ ఎస్ఈ బాలచంద్రారెడ్డి

కర్నూలు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): హంద్రీనీవా కాలువ ద్వారా సకాలంలో 77 చెరువులను నింపుతామని జలవనరుల శాఖ కర్నూలు సర్కిల్ ఎస్ఈ బి. బాలచంద్రారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం కృష్ణగిరి మండలం లక్కసాగరం వద్ద నిర్మించిన పంప్‌హౌస్‌ను పరిశీలించారు. డిస్ట్రిబ్యూటరీ పాయింట్‌ను తనిఖీ చేశారు. ఈ నెల 26న జరిగిన ఐఏబీ సమావేశంలో కర్నూలు జిల్లాలో ఉన్న 42 చెరువులకు తక్షణమే హంద్రీనీవా కాలువ ద్వారా నీటిని నింపాలని కలెక్టర్ పి.రంజిత్‌బాషా ఆదేశాలు జారీ చేశారు. ఇప్పటి వరకు పత్తికొండ, డోన్ నియోజకవర్గాల్లో 63 చెరువులు పూర్తిగా, పాక్షికంగా నింపితే.. కర్నూలు జిల్లాలో కృష్ణగిరి, తుగ్గలి, పత్తికొండ, కల్లూరు మండలాల్లో 42 చెరువులకు గానూ 15 చెరువులు పూర్తి స్థాయిలో, 14 చెరువులు పాక్షికంగా నింపినట్లు ఎస్ఈ బాలచంద్రారెడ్డి ఆంధ్రజ్యోతికి వివరించారు. త్వరలోనే అన్ని చెరువులను నింపుతామని తెలిపారు. ఎస్ఈ వెంట ఎఫ్ఆర్ఎల్ డివిజన్ డీఈఈలు రామకృష్ణ, శ్రీనివాస నాయక్, కోయా కంపెనీ ప్రతినిధులు ఉన్నారు.



హంద్రీనీవా నుంచి చెరువులకు నీటి విడుదలను పరిశీలిస్తున్న ఎస్ఈ

గరిష్ఠంగా ఉల్లి రూ.5,259

- వేరుశనగ కాయలు క్వింటా రూ.6,850
- పతనమైన ఎండు మిర్చి ధరలు



కర్నూలు అగ్రికల్చర్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): రైతులకు పంటల సాగు జూదంలా మారిపోయింది. ఏ పంటకు ఏ సమయంలో ధర వస్తుందో.. తగ్గుతుందో అర్థం కాని పరిస్థితి నెలకొంది. రెండు రోజుల కిందట ఉల్లికి గరిష్ఠ ధర రూ.4,200, కనిష్ఠ ధర రూ.400 దక్కగా శుక్రవారం గరిష్ఠ ధర ఏకంగా క్వింటానికి రూ.5,259, మధ్యస్థ ధర రూ.3,519, కనిష్ఠ ధర రూ.515 దక్కింది. వేరుశనగ కాయల ధర మాత్రం నిలకడగా ఉంది. గత సంవత్సరం ఈ సమయానికి రూ.7వేలకు పైగా ఉన్న గరిష్ఠ ధర ప్రస్తుతం రూ.6,850గా నమోదైంది. మధ్యస్థ ధర రూ.6,109, కనిష్ఠ ధర రూ.4,499 రైతులకు అందినట్లు సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీ జయలక్ష్మి తెలిపారు. గత సంవత్సరం ఇదే సమయానికి ఎండు మిరపకాయలకు రూ.25 వేలకు పైగానే గరిష్ఠ ధర నమోదైంది. శుక్రవారం గరిష్ఠ ధర రూ.14,859లు, మధ్యస్థ ధర రూ.11,499, కనిష్ఠ ధర రూ.799 మాత్రమే రైతుల చేతికి అందింది. మొక్కజొన్నలకు గరిష్ఠ ధర రూ.2,269, మధ్యస్థ ధర రూ.2,263, కనిష్ఠ ధర రూ.2,119 పలికింది. కంది లు గరిష్ఠ, మధ్యస్థ ధర లు రూ.9,469, కని ష్ఠ ధర రూ.8,609 రైతులకు అందాయి.

పెండింగ్ పనులు పూర్తి చేయండి

కర్నూలు, న్యూసిటీ, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో జరుగుతున్న రోడ్ల నిర్మాణ పెండింగ్ పనులను నాణ్యతా ప్రమాణాలతో వేగంగా పూర్తి చేయాలని పంచాయతీరాజ్ ఎస్ఈ వి. రామచంద్రారెడ్డి ఆదేశించారు. శుక్రవారం జడ్పీ ఆవరణలోని విశ్వేశ్వరయ్య భవన్‌లో కర్నూలు, ఆదోని డివిజన్ అధికారులు, కాంట్రాక్టర్లతో పీఎంజీఎస్‌వై, నాబార్డు, ఏపీఆర్ఆర్‌పీ, ఎన్ఆర్ఈజీఎస్, పల్లె పండుగ పనులపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఈ మాట్లాడుతూ గత తొమ్మిది నెలలుగా నిధులు మంజూరు కాకపోవడంతో కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదని, ప్రస్తుతం ప్రభుత్వం పుష్కలంగా నిధులు విడుదల చేస్తున్నదని, పెండింగ్ పనులు వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రస్తుతం చేసిన పనులకు డిసెంబర్ 1 నుంచి బిల్లులు అప్‌లోడ్ చేయాలని అన్నారు. పీఎంజీఎస్‌వై కింద జిల్లాలో 6 పనులకు మూడు పనులు పూర్తి అయ్యాయన్నారు. మిగిలిన వాటిని సత్వరమే పూర్తి చేయాలని అధికారులను ఆదేశిం చారు. నియోజకవర్గాల వారిగా బీటీ రోడ్డు డ్యామేజీ వివరాలను త్వరితగతిన అందజేయాలని అన్నారు. పెండింగ్ బిల్లులు విడుదల అవుతున్నాయని సత్వరమే మిగిలిన వాటిని అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో కర్నూలు, ఆదోని ఈఈలు ఎస్‌సీ ఈ. మద్దన్న, డీసీ. వెంకటేస్, రాఘురామ్‌రెడ్డి, డీఈఈలు రమేష్‌కుమార్‌రెడ్డి, భాస్కర్, మల్లికార్జున, శిల్పాశ్రీ, మురహరి రావు, రామ్మోహన్, మల్లికార్జున, అశ్వత్థామ పాల్గొన్నారు.

టాలెంట్



వెండి తెర వెంకట్



ఓ సీరియల్‌లో నటిస్తున్న వెంకట్

- 'ముహూర్తం'తో మొదలైన నట ప్రస్థానం
- సినీ రంగంలో రాణిస్తున్న ఎమ్మిగనూరు వాసి

ఎమ్మిగనూరు, నవంబరు 29(ఆంధ్రజ్యోతి):

నటించటం ఆయనకు ప్రాణం.. అంతకు మించి నటనలో జీవించటం ఆయన ప్రతిభకు నిదర్శనం. నటనపై ఉన్న ఆసక్తే సినీరంగంలో ప్రవేశానికి ముహూర్తమైంది. 'ముహూర్తం' పేరుతోనే సినీ ప్రస్థానం మొదలైంది. ముహూర్తంతో మొదలైన నట జీవితం బుల్లి, వెండి తెరల వైపుగా సాగింది. గుంపు నటుడుగా ప్రవేశించి నటనా ప్రావీణ్యంతో ఆర్టిస్టుగా రాణిస్తున్నాడు. పుట్టినూరుతోపాటు తన పేరును వెండితెరపై చూడాలన్న ఆసక్తి వెండి తెర వైపు నడిపించిందని, తనకంటూ ఓ గుర్తింపు తెచ్చుకోవాలని పాతికేళ్లుగా నటనా రంగంలో రాణిస్తున్నానని వెంకట్ చెబుతున్నారు.

నటనపై ఆసక్తితో..

ఎమ్మిగనూరు పట్టణంలోని ఎస్ఎంటీ కాలనీలో రంగయ్య, సుభద్రమ్మల మూడో కుమారుడు వెంకట గోవిందరాజు. తండ్రి స్థానిక చేనేత సహకార సంఘంలో అకౌంటెంట్‌గా పని చేసేవాడు. తల్లి గృహిణి. వెంకట గోవిందరాజులు స్థానిక వీవర్స్ కాలనీలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి వరకు చదివాడు. చిన్నప్పటి నుంచే సినిమాలపై ఎంతో ఆసక్తి ఉండేది. పలుమార్లు పాఠశాలకు డుమ్మా కొట్టి సినిమాలకు వెళ్లేవాడు. ఇలా సినిమాలు చూడడంతో సినీ రంగంపై ఆసక్తి పెరిగింది. వెంకట గోవిందరాజులు సీనియర్ ఎన్టీఆర్ నటించిన దానవీరశూరకర్ణ సినిమాను దాదాపు 50 సార్లు చూశాడంటే సినిమా అంటే ఎంత పిచ్చో అర్థం చేసుకోవచ్చు. అప్పట్లోనే ఎలాగైనా తాను కూడా సినిమా రంగంలోకి వెళ్లాలని, నటుడిగా సినిమాల్లో నటించి మంచి నటుడిగా గుర్తింపు పొంది తనకు తన ఊరికి మంచి పేరు తీసుకురావాలనుకున్నాడు. ఇందులో భాగంగానే 1998లో ఎమ్మిగనూరు నుంచి హైదరాబాదుకు వెళ్లి ఓ సినిమా, డ్యాన్స్ ఇన్‌స్టిట్యూట్‌లో చేరి ఏడాది నుంచి రెండేళ్ల పాటు శిక్షణ తీసుకున్నాడు. 2000 నుంచి దాదాపు ఐదేళ్ల పాటు సినిమాల్లో గుంపులో నటుడిగా నటిస్తూ వచ్చాడు. అలా సినిమా రంగ ప్రవేశం చేశాడు. ఐదేళ్ల పాటు నటుడిగా పని చేస్తుండడంతో పలువురి సినిమా వాళ్లతో పరిచయాలు పెరిగాయి. అటు తర్వాత సినిమా అవకాశాన్ని సంపాదించుకున్నాడు.

మంచి నటుడిగా గుర్తింపు పొందాలన్నదే లక్ష్యం

సినిమా ప్రేక్షకులు, బుల్లి తెర ప్రేక్షకులను నా నటనతో అలరించి మంచి నటుడిగా గుర్తింపు తెచ్చుకోవాలన్నదే నా లక్ష్యం. ప్రేక్షకులే మాకు దేవుళ్లు. వారి ఆదరాభిమానాలతోనే ఇప్పటి వరకు ఈ స్థాయికి వచ్చాను. రాబోయే రోజుల్లో మరిన్ని అవకాశాలు పొంది ప్రేక్షకులను అలరించాలన్నదే నా కోరిక.

- వెంకట గోవిందరాజులు అలియాస్ వెంకట్‌జీ, సినీ నటుడు

ముహూర్తం సినిమాతో మొదలై..

2005లో విడుదలైన ముహూర్తం (నంది అవార్డు సినిమా) సినిమాలో హీరో ప్రవీణ్‌కుమార్ స్నేహితుడిగా మొదటి సారి వెండితెరపై నటించాడు. అటు తర్వాత శశాంక్ హీరోగా నటించిన అదే నువ్వు.. అదే నేను, 1940లో ఒక గ్రామం, రైల్వేస్టేషన్ వంటి సినిమాలతోపాటు మొత్తం 50 సినిమాల్లో నటుడిగా రాణించారు. ఓ వైపు సినిమాల్లో వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూనే మరో వైపు బుల్లితెరపై కూడా తన నటనను కొనసాగిస్తూ వచ్చాడు. ప్రధానంగా ముద్దమందారం, కథలో రాజకుమారుడు, అభిషేకం, మనసు మమత, క్రాంతి, లక్ష్యం, ఆనందమానందమాయే, స్వాతి చినుకులు, మామగారు, అమ్మాయిగారు వంటి సీరియల్స్‌లో నటించాడు. ఇలా దాదాపు 200 వరకు సీరియల్స్‌లో తన నటనతో ప్రేక్షకులను అలరిస్తూ వస్తున్నాడు. ముహూర్తం, అదే నువ్వు.. అదే నేను సినిమాలతో మంచి గుర్తింపు లభించగా, వరూధిని పరిణయం, రాధమ్మ కూతురు, స్వాతి చినుకులు వంటి సీరియల్స్ ద్వారా బుల్లితెర నటుడిగా మంచి గుర్తింపు తెచ్చుకున్నాడు. ప్రస్తుతం వెంకట్ నటించిన ప్రేమియో సినిమా రిలీజ్‌కు సిద్ధంగా ఉంది. సాధారణ కుటుంబం నుంచి వెళ్లి అటు వెండి తెరపైన.. ఇటు బుల్లితెరపైన తనదైన నటనతో సినీ, బుల్లి తెర ప్రేక్షకులను అలరిస్తున్న వెంకట్‌కు మరిన్ని మంచి అవకాశాలు వచ్చి ఎమ్మిగనూరు వెండితెరపై చూపేలా చేయాలని ఎమ్మిగనూరు సినీ ప్రేక్షకులు ఆకాంక్షిస్తున్నారు.

బాల్య వివాహాలు నేరం

- ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించండి
- జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి. నవ్య



మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ డా.బి. నవ్య

కర్నూలు హాస్పిటల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని, కిషోర బాలికలు ఎదుర్కొంటున్న ఈ సమస్యపై గ్రామాల్లోని ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని జాయింట్ కలెక్టర్ డా.బి. నవ్య పిలుపునిచ్చారు. మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం నగరంలోని జిల్లా పరిషత్ కార్యాలయంలో ఐసీడీఎస్ పీడీ పి.వెంకటలక్ష్మి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న జేసీ మాట్లాడుతూ కిషోర వికాసంపై శిక్షణ పొందిన వారు ఈ వయస్సులో బాలికల్లో వచ్చే మార్పులు, ఆరోగ్యం, పోషకాహారంపై అవగాహన కల్పించాలన్నారు. మండల స్థాయిలో, గ్రామస్థాయిలో కమిటీలను బలోపేతం చేయడానికి మూడు నెలలకు ఒకసారి సమావేశాలు నిర్వహించాలన్నారు. అనంతరం బాల బాలికలకు అత్యవసర హెల్ప్ డెస్క్ నెంబర్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డీసీపీవో టి.శారద, డీఆర్‌డీఏ ఐసీడీఎస్ మున్సిపాలిటీ ఎడ్యుకేషన్ హెల్త్ అండ్ ఆర్‌కేఎస్‌కే ఎన్‌జీవో ప్రతినిధులు, జిల్లా బాలల సంక్షేమ సమితి సభ్యులు, మెప్మా శిక్షకులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

ఆత్మకూరు రూరల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఎదురెదురుగా రెండు బైకులు ఢీకొని శ్రీనివాసులు(26) అనే యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటన ఆత్మకూరు మండలం కరివేన గ్రామ శివారులోని కేజీ రహదారిపై జరిగింది. శుక్రవారం ఆత్మకూరు ఎస్ఐ వెంకటనారాయణరెడ్డి తెలిపిన వివరాలివీ.. కొత్తపల్లి మండలం నందికుంట గ్రామానికి చెందిన ఉద్యానవన శాఖ ఎంపీఈవో శ్రీనివాసులు బైక్‌పై పాములపాడుకు వెళ్లి అక్కడ తన పనులు ముగించుకుని తన స్వగ్రామానికి బయలు దేరాడు. ఈ క్రమంలో ఆత్మకూరు నుంచి పాములపాడుకు మరో బైక్‌పై వెళుతున్న గుర్తు తెలియని వ్యక్తి మండలంలోని కరివేన గ్రామ శివార్లలోని వీర బ్రహ్మేంద్ర స్వామి గుడి ప్రాంతంలోని కేజీ రోడ్డుపై ఎదురుగా వచ్చాడు. ప్రమాదవశాత్తు రెండు బైకులు ఢీకొన్నాయి.ఈ రోడ్డు ప్రమాదంలో ఎంపీఈవో శ్రీనివాసులుకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. శ్రీనివాసులును 108లో స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే శ్రీనివాసులు మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెంకటనారాయణరెడ్డి తెలిపారు.

రహదారి పనుల పరిశీలన

రైతుల సమస్యలు పరిష్కరిస్తామన్న జేసీ



రైతుల పొలాలకు రస్తాలను పరిశీలిస్తున్న జేసీ విష్ణుచరణ్

నందికొట్కూరు రూరల్/ జూపాడుబంగ్లా, నవంబరు29 (ఆంధ్రజ్యోతి) : జాతీయ రహదారి 340 పనులను జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్, నేషనల్ హైవే పీడీ పద్మజ శుక్రవారం పరిశీలించారు. నందికొట్కూరు మండలంలోని నందికొట్కూరు, బొల్లవరం, దామగట్ల, బ్రాహ్మణకొట్కూరు పొలాల మీదుగా వెళుతున్న జాతీయ రహదారి పనులను నంద్యాల జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్, పీడీ పద్మజ పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జయసూర్య మాట్లాడుతూ ఈ జాతీయ రహదారి నిర్మాణం వల్ల రైతుల పొలాలకు వెళ్లే రహదారులు మూసుకు పోయాయని, దీని వల్ల రైతులు తమ పొలాలకు వెళ్లడానికి చాలా కష్టపడాల్సి వస్తుందని జేసీ దృష్టికి తీసుకుని వెళ్లారు. స్పందించిన జేసి విష్ణుచరణ్ మాట్లాడుతూ రైతుల రస్తా సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకుని వెళతానని అన్నారు. ఈ కార్యక్రమంలో నందికొట్కూరు తహసీల్దార్ శ్రీనివాసులు, మాజీ ఎంపీపీ వీరం ప్రసాదరెడ్డి, బ్రాహ్మణకొట్కూరు మాజీ సింగిల్ విండో చైర్మన్ మద్దూరు హరిసర్వోత్తమరెడ్డి, ఖలీలుల్లా బేగ్ పాల్గొన్నారు.

జూపాడుబంగ్లా మండలంలో...

జూపాడుబంగ్లా మండలం తాటిపాడు వద్ద రెండురోజుల కిందట రైతులు జాతీయ రహదారి పనులను అడ్డుకోవడాన్ని శుక్రవారం జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్ పరిశీలించారు. సర్వీస్ రోడ్డు ఏర్పాటు చేయాలని, లేకపోతే రైతులం కిలోమీటర్ల పొడవున పొలాల్లో ఇబ్బందులు పడాల్సి వస్తుందని వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ చంద్రశేఖర్‌నాయక్, రైతులు ఖాజీకురైషన్, రవికుమార్‌యాదవ్, మన్సూర్‌బాషా, జిన్నుబాసా, మాలిక్‌బాషా పాల్గొన్నారు.

ఆయుష్..!

- వైద్యులు లేక రోగుల అగచాట్లు
- ఆయుర్వేద ఆసుపత్రికి ఫార్మాసిస్టు దిక్కు



ఆయుర్వేద వైద్యశాలలో మందులు ఇస్తున్న ఫార్మాసిస్టు

కర్నూలు హాస్పిటల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలోని ఆయుర్వేద, హోమియో వైద్యశాలలో డాక్టర్లు లేక రోగులు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో ఆయుష్ విభాగంలో నిర్వహించే ఆసుపత్రులు నిర్వీర్యమవుతున్నాయి. కర్నూలు జీజీహెచ్‌లోని ఆయుర్వేద వైద్యశాలలో వైద్యులు లేకపోవడంతో ఫార్మాసిస్టు రోగులకు దిక్కయ్యారు. కర్నూలు జీజీహెచ్ ఆయుర్వేద వైద్యశాలలో పని చేస్తున్న ఆయుర్వేద సీనియర్ మెడికల్ ఆఫీసర్‌కు కర్నూలు జీజీహెచ్‌తో పాటు సీక్యాంపు, ఎమ్మిగనూరు ఇలా మూడు చోట్ల డ్యూటీలు వేశారు. వారంలో కొన్ని రోజులు ఆయుర్వేద డాక్టరు లేకపోవడంతో పాత చీటి తీసుకుని వచ్చిన రోగులకు ఫార్మాసిస్టు మందులను అందిస్తున్నారు. వైద్యం కోసం వచ్చిన రోగులు ఆయుర్వేద డాక్టర్ లేకపోవడంతో వెనక్కు వెళ్లిపోతున్నారు. ఇక కర్నూలు జీజీహెచ్ హోమియో వైద్యశాలలో కూడా హోమియో సీనియర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ లేకపోవడం అక్కడనున్న సిబ్బంది ఒక్కరే ఉన్నారు. ఈ హోమియో డాక్టర్‌కు కూడా వెల్దుర్తి, కర్నూలు జీజీహెచ్ రెండు చోట్ల ఆయుష్ అధికారులు బాధ్యతలు అప్పగించారు. వెల్దుర్తిలో మంగళ, గురు, శనివారాల్లో పని చేస్తుండగా.. మిగిలిన మూడు రోజులు కర్నూలు జీజీహెచ్ హోమియో వైద్యశాలలో విధులు నిర్వహించేలా ఆయుష్ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. కర్నూలు జీజీహెచ్‌లోని ఆయుర్వేదం, హోమియో వైద్యశాలలో బుధవారం మరో ప్రాంతంలో విధులు నిర్వహిస్తుండటంతో ఇక్కడ ఉదయం ఫార్మాసిస్టు, మరో ఉద్యోగి వచ్చి ఆసుపత్రులను తెరుస్తున్నారు. ప్రతి రోజు డాక్టర్లు ఉంటే.. 60 నుంచి 70 మంది రోగులు వస్తుంటారు. జిల్లా కేంద్రమైన కర్నూలు జీజీహెచ్‌లోని ఆయుష్ విభాగంలో వైద్యులు లేకపోవడంపై రోగులు మండిపడుతున్నారు. జిల్లా కేంద్రంలోనే ఈ పరిస్థితి ఉంటే మిగిలిన వైద్యశాలల పరిస్థితి ఏమిటని రోగులు ప్రశ్నిస్తున్నారు.



హోమియో వైద్యశాలలో ఉన్న ఉద్యోగి

పోలీసుల ముమ్మర తనిఖీలు



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

నంద్యాల క్రైం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా ఆదేశాల మేరకు శుక్రవారం జిల్లా వ్యాప్తంగా విజిబుల్ పోలీసింగ్‌లో ముమ్మర తనిఖీలు నిర్వహించినట్లు పోలీస్ అధికారులు తెలిపారు. అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో పోలీస్ అధికారులు, సిబ్బంది ఈ తనిఖీలు నిర్వహించారు. రోడ్డు ప్రమాదాల నివారణ, మద్యం, పీడీఎస్ బియ్యం, గంజాయి తదితర వాటిని అక్రమ రవాణా చేయకుండా అడ్డుకునేందుకు విజిబుల్ పోలీసింగ్ నిర్వహించినట్లు పేర్కొన్నారు. సైబర్ క్రైం, రోడ్డు ప్రమాదాలు, డ్రగ్స్ వాడకం వల్ల జరిగే నష్టాలు, మహిళలపై జరిగే నేరాలు తదితర వాటిపైన ప్రజలకు అవగాహన కల్పించారు. జిల్లాలో నేర నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణే లక్ష్యంగా విజిబుల్ పోలీసింగ్ నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఆయా గ్రామాల్లో పోలీస్ అధికారులు, సిబ్బంది ఫుట్ పెట్రోలింగ్ చేస్తూ ప్రజలకు శాంతిభద్రతలపై భరోసా కల్పించారు.

నీటి సంఘాల ఎన్నికలకు సిద్ధం



5వ పేజీ తరువాయి

చలి కాలంలో రాజకీయ వేడి

అసెంబ్లీ సార్వత్రిక ఎన్నికలు తరువాత జరుగుతున్న ఎన్నికలు ఇవి. అధికార, ప్రతిపక్ష పార్టీలకు గ్రామాల్లో రాజకీయ పట్టు కోసం నీటి సంఘాలు కీలకంగా మారనున్నాయి. నీటి సంఘాలను ఏకగ్రీవం చేసుకోవడానికి అధికార టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి నాయకులు వ్యూహాత్మకంగా పావులు కదుపుతున్నారు. ఇప్పటికే ఎమ్మెల్యేలు, ముఖ్య రాజకీయ నాయకులు రంగంలోకి దిగారు. నీటి సంఘాలు, డిస్ట్రిబ్యూటరీ కమిటీలు, ప్రాజెక్టు కమిటీల అధ్యక్ష, ఉపాధ్యక్ష అభ్యర్థుల వేటలో నిమగ్నమయ్యారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఘోర ఓటమితో నిస్తేజంలో ఉన్న వైసీపీ నాయకులు కూడా నీటి సంఘాల ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఎత్తులు వేస్తున్నారు. ఈ ఎన్నికల్లో పట్టు సాధిస్తే రాబోయే గ్రామ పంచాయతీ ఎన్నికల్లో ఉపయోగకరంగా ఉంటుందని ఇరుపార్టీల నేతలు ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవడంతో పల్లెసీమల్లో రాజకీయ వేడి రాజుకుంది.

నీటి సంఘాల ఎన్నికల షెడ్యూల్

- నోటిఫికేషన్ (టీసీ, డబ్ల్యూయూఏ, డీసీ, పీసీ కమిటీ): డిసెంబరు 5
- నీటి సంఘాల టీసీ సభ్యులు, అధ్యక్ష, ఉపాధ్యక్ష ఎన్నిక : 8న
- డిస్ట్రిబ్యూటరీ కమిటీ (మేజర్, మీడియం ప్రాజెక్ట్స్) : 11న
- మేజర్, మీడియం ప్రాజెక్ట్ కమిటీ ఎన్నిక : 14న

కర్నూలు జిల్లాలో సాగునీటి సంఘాలు, డీసీ, పీసీ, ఆయకట్టు (ఎకరాలు) వివరాలు

ప్రాజెక్టు	డబ్ల్యూయూఏ	డీసీ	పీసీ	ఆయకట్టు
కేసీ కెనాల్	2	–	--	4,760
తుంగభద్ర	58	10	1	1,51,134
ప్రాజెక్టు ఎల్లెల్సీ ఆలూరు	6	–	--	14,254.67
బ్రాంచి కెనాల్ హంద్రీ నీవా కాలువ	3	–	--	5,072.82
గాజులదిన్నె ప్రాజెక్టు	12	–	1	25,488.34
మైనర్ ఇరిగేషన్ చెరువులు	42	–	--	19,789.60
మొత్తం	123	10	2	2,20,499.43

నంద్యాల జిల్లాలో సాగు నీటి సంఘాలు, డీసీ, పీసీ, ఆయకట్టు (ఎకరాలు) వివరాలు:

ప్రాజెక్టు	డబ్ల్యూయూఏ	డీసీ	పీసీ	ఆయకట్టు
కేసీ కాలువ	52	9	1	1,62,854.46
శ్రీశైలం కుడి కాలువ (ఎస్సార్బీసీ)	50	8	1	1,53,034.8
తెలుగుగంగ ప్రాజెక్టు	47	8	1	1,29,412.42
శివభాష్యం ప్రాజెక్టు	7	–	1	12,092
మైనర్ ఇరిగేషన్ చెరువులు	104	–	--	40,056.79
మైలవరం ప్రాజెక్టు	1	–	--	740.21
మొత్తం	261	25	4	4,98,190.68

పెద్దాసుపత్రి అడ్మినిస్ట్రేటర్‌గా డిప్యూటీ కలెక్టర్

సింధు సుబ్రహ్మణ్యంను నియమిస్తూ ఉత్తర్వులు

కర్నూలు హాస్పిటల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల అడ్మినిస్ట్రేటర్‌గా డిప్యూటీ కలెక్టర్ సింధు సుబ్రహ్మణ్యంను నియమిస్తూ ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ నీరబ్ కుమార్ ప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రభుత్వ ఆసుపత్రిలో పరిపాలనకు సంబంధించిన వ్యవహారాన్ని ఇక నుంచి డిప్యూటీ కలెక్టర్ చూడనున్నారు. ఆసుపత్రిలోని ఏజెన్సీలు, టెక్నికల్ వ్యవహారాలు, పరికరాల కొనుగోలు, వ్యవహారాన్ని డిప్యూటీ కలెక్టర్ నిర్వహిస్తారు. ఆసుపత్రి సూపరింటెండెంట్, సీఎస్ఆర్ఎంవో, ఆర్ఎంవోలు వైద్యసేవలకే పరిమితమవుతున్నట్లు సమాచారం.

మధ్యాహ్న భోజనం ధరలు పెంపు

కర్నూలు ఎడ్యుకేషన్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): జిల్లాల్లో ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనం పథకానికి సంబంధించిన ధరలను పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి శ్యామ్యూల్ పాల్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పీఎం పోషణ పథకం కింద అందిస్తున్న మధ్యాహ్న భోజనం ధరలను 1నుంచి 5వ తరగతి వరకు చదివే విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ 5.45 నుంచి రూ 6.19, 6నుంచి 8వ తరగతి వరకు విద్యార్థులకు రూ. 8.17 నుంచి రూ.9.29 పెంచుతూ ఆదేశాలు జారీ చేశారు. పెంచిన రేట్లు డిసెంబరు 1వ తేదీ నుంచి అమలులోకి రానున్నట్లు డీఈవో వివరించారు. నాణ్యమైన, రుచికరమైన ఆహారాన్ని అందించేలా విద్యాశాఖ అధికారులు, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు చర్యలు తీసుకోవాలని ఈయన సూచించారు.

తినేస్తున్నారు..!



పాఠశాలలో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం

- మధ్యాహ్న భోజన పథకం నిర్వహణలో ఏజెన్సీ దోపిడీ
- పిల్లల సంఖ్యకు.. బియ్యం కోటాకు తేడా
- వంట మనుషుల గౌరవ వేతనంలోనూ నొక్కుడే

ఆదోని అగ్రికల్చర్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : మధ్యాహ్న భోజన ఏజెన్సీ నిర్వాహకులు అందినకాడికి దోచేస్తున్నారు. అడిగేవారే లేరని ఇష్టారీతిన వ్యవహరిస్తున్నారు. పట్టణంలోని నెహ్రూ మెమోరియల్ పురపాలక ఉన్నత పాఠశాలలో 1,952 మంది విద్యార్థులు చదువుతున్నారు. విద్యార్థుల సంఖ్య అధికంగా ఉండడంతో భారీగా మిగులుతుందని వంట నిర్వహణకు పోటీ పడ్డారు. వైసీపీ ప్రభుత్వం మారి కూటమి అధికారంలోకి రావడంతో వంట ఏజెన్సీ నిర్వాహకులను కూడా మార్చారు. అధికార పార్టీకి చెందిన ఓ మహిళా నాయకురాలు తన అనుచరుడికి చెందిన మహాలక్ష్మి గ్రూప్ ఏజెన్సీకి వంట చేసే బాధ్యతను అప్పగించేలా పావులు కదిపినట్లు సమాచారం. సెప్టెంబరు 1 నుంచి మహాలక్ష్మి గ్రూప్ చెందిన భరత్ అనే వ్యక్తి వంట చేసే బాధ్యతను తీసుకున్నారు. 1,952 మంది విద్యార్థుల్లో 150 మందిని డ్రాప్‌ఔట్ కింద చూపుతున్నారు. 1,800 మంది ఉన్నట్లు రికార్డుల్లో చూపుతున్నారు. శుక్రవారం 1,321 మంది విద్యార్థులు బడికి హాజరయ్యారు. 1,140 మంది విద్యార్థులు మధ్యాహ్న భోజనం తింటున్నట్లు ఆన్‌లైన్‌లో పొందుపరిచారు.

● 70 కేజీల బియ్యం ఎక్కడికి వెళ్లినట్లు..?


1321 మంది హాజరైతే 1140 మధ్యాహ్న భోజనం తింటున్నట్లు లెక్కలు చూపిస్తూ.. ఒక్కో విద్యార్థికి 150 గ్రాముల చొప్పున బియ్యం ప్రభుత్వం అందిస్తోంది. ఈ లెక్కన 171 కేజీల బియ్యాన్ని విద్యార్థులకు వడ్డించాల్సి ఉంది. మరి గురువారం వంద కేజీల బియ్యం మాత్రమే వండారు. అంటే మిగతా 71 కేజీల బియ్యం ఎక్కడికి వెళ్లాయో తెలియాల్సిన అవసరం ఉంది. ఈ ఒక్క రోజే కాదు ప్రతిరోజూ విద్యార్థులకు భోజనం వడ్డిస్తున్న లెక్కల్లో, బియ్యం కొలతల్లోనూ వ్యత్యాసం ఉన్నట్లు తెలుస్తోంది.

● గౌరవ వేతనంలోనూ నొక్కుడే..

1800 మంది విద్యార్థులు ఉండడంతో పది మందికి ఓ కుక్, హెల్పర్లను నియమించుకోవచ్చని ఏజెన్సీలకు సూచించింది. ఒక్కొక్కరికి నెలకు రూ.3 వేల గౌరవ వేతనం అందిస్తోంది. పూర్తిగా వారి గౌరవేతనం డ్రా చేస్తున్నప్పటికీ వంట చేసేది మాత్రం కేవలం ఆరుగురు మాత్రమే. ఇందులోనూ నెలకు రూ.12 వేలు నొక్కేస్తున్నారు.

● ప్రభుత్వమే అన్ని ఇస్తున్నా..

కూటమి ప్రభుత్వం మారాక మధ్యాహ్న భోజన పథకం మెనూలో భారీగా మార్పులు చేసింది. గురువారం ఆకుకూర పప్పు, అన్నంతో పాటు గుడ్డు అందించాలి. బియ్యం, గుడ్డు ప్రభుత్వమే నేరుగా పాఠశాలలకు కాంట్రాక్టర్ ద్వారా సరఫరా చేస్తోంది. వంట చేసేందుకు, ఇతర ఖర్చుల కోసం ఒక్కో విద్యార్థికి రూ.8.17 పైసలను చెల్లిస్తోంది. ఈ లెక్కన్న రోజుకు రూ.9313 విద్యార్థుల సంఖ్యను బట్టి వారికి చెల్లిస్తోంది. అయినప్పటికీ ఏజెన్సీ నిర్వాహకులు భారీగా దోచేస్తున్నారు. విద్యార్థుల హాజరు.. భోజనం తింటున్న విద్యార్థుల సంఖ్య, భోజనం తయారీకి బియ్యం వేసిన లెక్కను అడిగితే ఆ పాఠశాల హెచ్‌ఎం అలిం సిద్ధికి అసహనం వ్యక్తం చేశారు.



● కొరవడిన పర్యవేక్షణ

విద్యాశాఖ అధికారులు తూతూ మంత్రంగా మధ్యాహ్న భోజన పథకాన్ని పర్యవేక్షణ చేసి వెళుతున్నారు. పాఠశాల హెచ్‌ఎం, వంట ఏజెన్సీ వారు చెప్పిందే లెక్క.. గుడ్డిగా సంతకం చేసి తనిఖీ చేసినట్లు వెళ్లిపోతున్నారు. పర్యవేక్షణ లేకపోవడంతో వీరు ఆడిందే ఆట పాడిందే పాటగా తయారైంది. ఇంత తతంగం జరుగుతున్నా అధికారులు మాత్రం పట్టనట్లు వ్యవహరిస్తున్నారు.

నిబంధనలు పాటించకపోతే చర్యలు



ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం విద్యార్థులకు భోజనం వడ్డించాలి. ప్రభుత్వం మధ్యాహ్నం భోజన పథకంలో ఖచ్చితమైన నిబంధనలు పాటించాలని సూచించింది. పాఠశాలలోని విద్యార్థులంతా భోజనం చేసేలా వారిని ఉపాధ్యాయులు ప్రోత్సహించాలి. వంట ఏజెన్సీలు సైతం మెనూ పాటించకపోతే చర్యలు తీసుకుంటాం. విద్యార్థుల నిష్పత్తికి అనుగుణంగా వంట మనిషితో పాటు సహాయకులు ఉండాల్సిందే. నిబంధనలు పాటించకుండా బియ్యం వినియోగంలో తారతమ్యం ఉంటే సహించే ప్రసక్తే లేదు. ఆ పాఠశాలలో విద్యార్థులు మధ్యాహ్న భోజనానికి సంబంధించిన రికార్డులను తెప్పించుకుని పరిశీలిస్తాం.

- శ్యామ్యూల్ పాల్, డీఈఓ, కర్నూలు

త్వరలో జిల్లా సహకార బ్యాంకు సీఈవోల నియామకం



జిల్లా సహకార కేంద్ర బ్యాంకు

కర్నూలు అగ్రికల్చర్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో జిల్లా సహకార కేంద్ర బ్యాంకుల్లో ఖాళీగా ఉన్న సీఈవోల పోస్టులను భర్తీ చేసేందుకు ప్రభుత్వం చర్యలు ప్రారంభించినట్లు అధికార వర్గాలు తెలిపాయి. ఈ నెల 13, 14 తేదీల్లో కర్నూలు, గుంటూరు, ప్రకాశం, ఏలూరు, అనంతపురం జిల్లాల సహకార కేంద్ర బ్యాంకుల సీఈవోల పోస్టులను భర్తీ చేసేందుకోసం ఆప్కాబ్ ఇంటర్వ్యూలను కూడా నిర్వహించింది. కర్నూలు జిల్లా సహకార కేంద్ర బ్యాంకు సీఈవోగా నియమించేందుకు ఇక్కడ పని చేస్తున్న నాగిరెడ్డి (డీజీఎం) ఇంటర్వ్యూకు హాజరైనట్లు తెలిసింది. మరో ముగ్గురుకి సీఈవోగా నియామకం పొందేందుకు అర్హత ఉన్నా.. వారికి ఆ పదవి ఇష్టం లేక ఇంటర్వ్యూకు హాజరు కాలేదు. రాజకీయ నేతల పడగ నీడలో సహకార కేంద్ర బ్యాంకు సీఈవోలుగా పని చేయడం అంటే కత్తిమీద సాములా ఉంటుందని వారు ఆసక్తి చూపడం లేదని తెలుస్తోంది.

మార్క్‌ఫెడ్ డీఎం ఆకస్మిక తనిఖీ

● రైతులకు ఎరువుల కొరత లేదని వెల్లడి



గోదాంలో ఎరువులను పరిశీలిస్తున్న అధికారులు

కర్నూలు అగ్రికల్చర్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): నంద్యాల మార్క్‌ఫెడ్ డీఎం హరినాథరెడ్డి శుక్రవారం ప్యాపిలి మండల కేంద్రంలోని డీసీఎంఎస్ కేంద్ర కార్యాలయాన్ని, గోదామును అకస్మికంగా శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గోదాములో నిల్వ చేసిన ఎరువులు, కందులను పరిశీలించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ డీసీఎంఎస్ కేంద్రాలకు ఎరువులను సప్లయ్ చేయడంలో ఇబ్బందులను రాష్ట్ర ఉన్నతాధికారులతో మాట్లాడుతామని హామీ ఇచ్చారు. ప్రస్తుతం జిల్లాకు కేటాయించిన ఎరువుల్లో 50 శాతం ఎరువులను రైతులకు ఎటువంటి కొరత లేకుండా రైతు సలహా కేంద్రాలు, వ్యవసాయ సహకార కేంద్రాలకు సరిపడ ఎరువులను అందిస్తున్నామని, ఎమ్మార్పీ ధరలకే ఈ ఎరువులను రైతులకు అందిస్తున్నట్లు డీఎం హరినాథరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ అధికారి రాఘవేంద్రరెడ్డి ఉన్నారు.

ఆర్టీసీ బస్టాండులో బంగారు గొలుసు అపహరణ

కర్నూలు క్రైం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): కర్నూలు నగరంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో శుక్రవారం బంగారు గొలుసు అపహరణకు గురైంది. పత్తికొండ మండలం నల్లచెలిమి గ్రామానికి చెందిన నాగరాజు దోర్నాలలో ఎస్‌బీఐ బ్యాంకులో ఉద్యోగం చేస్తున్నాడు. సొంతూరు వచ్చి తిరిగి దోర్నాల వెళ్లేందుకు కర్నూలుకు వచ్చాడు. కర్నూలులో దోర్నాల బస్సు ఎక్కే సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు ఈయన మెడలోని 4 తులాల బంగారు గొలుసుతో పాటు పర్సును అపహరించారు. దీంతో బాధితుడు పోలీసులను ఆశ్రయించాడు. ఫోర్త్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

శుభకార్యంలో...

మూడో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో మెగాసిరి ఫంక్షన్ హాలులో జరిగిన ఓ శుభకార్యంలో లక్ష్మి అనే మహిళ బంగారు నెక్లెస్ మాయమైంది. ఎండోమెంట్ కాలనీకి చెందిన నారాయణ, లక్ష్మి దంపతులు తమ కోడలు సీమంతం కార్యక్రమాన్ని స్థానిక మెగాసిరి ఫంక్షన్ హాలులో నిర్వహించారు. ఫంక్షన్ మొత్తం పూర్తయిన తర్వాత గ్రూప్ ఫొటో దిగే సమయంలో లక్ష్మి తన 5 తులాల నెక్లెస్‌ను పక్కన పెట్టి ఫొటో దిగింది. కొద్ది సేపటి తర్వాత చూస్తే అది కనిపించలేదు. సీసీ కెమెరాలు పరిశీలిస్తే.. ఆ సమయంలో మాత్రమే సీసీ కెమెరాలు ఆఫ్ చేసినట్లుగా గుర్తించారు. దీంతో వీరు పోలీసులను ఆశ్రయించారు. మూడో పట్టణ పోలీసులు కేసు విచారణ చేపట్టారు.

టమోటా ప్రాసెసింగ్ యూనిట్‌కు కనకదిన్నె దగ్గర స్థలం కేటాయింపు

పత్తికొండ టౌన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): టమోటా ప్రాసెసింగ్ యూనిట్‌ను ఏర్పాటు చేసేందుకు పత్తికొండ మండలం కనకదిన్నె సమీపాన ప్రభుత్వ భూమిని కేటాయించినట్లు తహసీల్దార్ రమేష్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో హోసూరు గ్రామ సమీపాన టమోటా జ్యూస్ ప్రాసెసింగ్ యూనిట్‌కు స్థలం కేటాయించడం జరిగిందని, ఆ స్థలం అనువైనది కాకపోవడంతో దీన్ని రద్దు చేయడం జరిగిందన్నారు. అయితే దూదేకొండ రెవెన్యూ పరిధిలోని కనకదిన్నె గ్రామ సమీపాన సర్వేనెంబర్.63లో 2.50 ఎకరాల ప్రభుత్వ భూమిని ప్రాసెసింగ్ యూనిట్‌కు కేటాయించడం జరిగిందన్నారు. ఈ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు కావడం వల్ల చుట్టు పక్కల గ్రామాల ప్రజలకు ఉపాధి అవకాశాలు ఉంటాయని తెలిపారు.

టైరు పేలి ట్రాక్టర్ బోల్తా ఒకరి మృతి.. ముగ్గురికి గాయాలు



బండలు మీద పడడంతో మల్లికార్జున మృతి

వెల్దుర్తి, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): టైరు పేలి ట్రాక్టర్ బోల్తా పడిన ఘటనలో ఒకరు మృతి చెందారు. మరో ముగ్గురికి గాయాలయ్యాయి. ఈ సంఘటన శుక్రవారం వెల్దుర్తిలో చోటుచేసుకుంది. ఓర్వకల్లు మండల కేంద్రానికి చెందిన ట్రాక్టర్ నాపరాతి బండల లోడుతో గోరంట్ల మండలం ఎస్‌హెచ్. ఎర్రగుడికి వెళుతోంది. శుక్రవారం తెల్లవారు జామున మార్గమధ్యంలో వెల్దుర్తి సమీపాన నక్కలమిట్ట (ఎగుమిట్ట) ఎక్కే సమయంలో ట్రాక్టర్ ఇంజన్ పెద్ద టైరు పేలిపోయి ట్రాక్టర్ అదుపు తప్పింది. ఎగువ మిట్ట కావడంతో లోడుతో ఉన్న ట్రాలీ పక్కకు బోల్తా కొడుతున్న సమయంలో డ్రైవర్ రామాంజనేయులు, ట్రాలీ మీద ఉన్న నాగేశ్వరరావు, కృష్ణ, మల్లికార్జున కిందకు దూకారు. నాపరాళ్లు మల్లికార్జున మీద పడడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మిగతా ముగ్గురికి గాయాలయ్యాయి. అటుగా వెళుతున్న వాహనదారులు 108 వాహనానికి సమాచారం అందించారు. గాయపడిన వారిని అంబులెన్స్‌లో వెల్దుర్తి సీహెచ్‌సీ ఆసుపత్రికి తరలించారు. మృతిచెందిన మల్లికార్జున మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం వెల్దుర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

గంజాయి కేసుల్లో నిందితులకు జైలు శిక్ష

కర్నూలు లీగల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): రెండు వేర్వేరు గంజాయి కేసులలో నలుగురు నిందితులపై నేరం రుజువు కావడంతో ఏడాది జైలు శిక్షతో పాటు రూ.18వేలు జరిమానా విధిస్తూ కర్నూలు ఎక్సైజ్ కోర్టు మేజిస్ట్రేట్ ఎం.సరోజనమ్మ శుక్రవారం తీర్పు చెప్పారు. 2018లో నగరంలోని కర్నూలుకు చెందిన నిందితులు శ్రీనివాసులుగౌడ, దావీదు, నీలి శికారి సన్ను, దోమల కార్తీక్ అనే నలుగురు నిందితుల నుంచి పెద్దమొత్తంలో పోలీసులు గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. కోర్టులో వీరిపై నేరం రుజువు కావడంతో ఏడాది కారాగారశిక్షతో పాటు రూ.18వేల జరిమానా విధించినట్లు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ కే.చంద్రహాసన్ ఒక ప్రకటనలో తెలిపారు.

మాలల ఐక్యతతోనే వర్గీకరణకు చరమగీతం

మాజీ ఎంపీ హర్షకుమార్



మాట్లాడుతున్న ఎంపీ హర్షకుమార్

ఆదోని, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : మాలల ఐకమత్యంతో ఎస్సీ వర్గీకరణకు చరమగీతం పాడుదామని మాజీ ఎంపీ హర్ష కుమార్, మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు పంది అశోక్ కుమార్ అన్నారు. శుక్రవారం ఆదోనిలో మాలల ఆత్మీయ సమ్మేళనం జరిగింది ముందుగా ఆర్ట్స్ కళాశాల జేబీ గార్డెన్ నుంచి పురవీధులలో పెద్ద ఎత్తున ర్యాలీ చేపట్టారు. జేబీ గార్డెన్‌లో నిర్వహించిన సభలో వారు మాట్లాడారు. సుప్రీంకోర్టు వర్గీకరణకు అనుకూలంగా తీర్పునివ్వడం అన్యాయమన్నారు. రాజకీయ దురుద్దేశంతోనే మాల, మాదిగలను విడదీస్తున్నారని ఆరోపించారు. మాలలంతా ఐక్యతతో ముందుకు సాగకపోతే మనుగడ కష్టంగా మారుతుందన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఇప్పటికైనా వర్గీకరణపై పునరాలోచించుకొని వెనక్కి తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు న్యాయవాది చంద్రయ్య, కొండలరావు కుమార్ స్వామి, జై భీమ్ సాయి, కల్లుబోతుల సురేష్, విజయ, శేఖర్, విజయ్ కుమార్, మాధవస్వామి, బొబ్బిలి, ఎల్లప్ప, మహానంది పాల్గొన్నారు.

ఎంఎస్‌ఎంఈ సర్వేను వేగవంతం చేయాలి

- జిల్లా గ్రామ పంచాయతీలో ఉపాధి హామీ పనులు జరగాలి
- ఇళ్ల నిర్మాణాలు వేగంగా జరగాలి
- గ్రామాల్లో తాగునీటి సమస్యలను గుర్తించి నివేదిక ఇవ్వండి
- కలెక్టర్ పి. రంజిత్ బాషా



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ పి. రంజిత్ బాషా

కర్నూలు కలెక్టరేట్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఎంఎస్‌ఎంఈ సర్వేను వేగవంతం చేసి వచ్చే ఏడాది ఫిబ్రవరి 1వ తేదీ నాటికి పూర్తి చేయాలని కలెక్టర్ పి. రంజిత్ బాషా ఎంపీడీవోలను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ నుంచి ఎంఎస్‌ఎంఈ సర్వే, హౌసింగ్, ఉపాధి హామీ, పీజీఆర్ఎస్, రీసర్వే తదితర అంశాలపై స్పెషల్ ఆఫీసర్లు, డివిజన్, మండల స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎంఎస్‌ఎంఈ సర్వే శుక్రవారం నుంచి ప్రారంభం అయిందన్నారు. ఎంఎస్‌ఎంఈ సర్వేకి సంబంధించిన రోజువారి పురోగతి నివేదికలు తనకు సమర్పించాలని అధికారులను ఆదేశించారు. సాగునీటి సంఘాల ఎన్నికలను ఇలాంటి లోటుపాట్లు లేకుండా నియమ నిబంధనల ప్రకారం నిర్వహించాలని అన్నారు. రీసర్వేకు సంబంధించి గ్రామ సభలు నిర్వహించడం ద్వారా వచ్చిన 18వేల అర్జీలను పీజీఆర్ఎస్ పోర్టల్‌లో రిజిస్టర్ చేయాలని అన్నారు. డిసెంబరు 31నాటికి అర్జీలను అన్నింటినీ నాణ్యతతో పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని తహసీల్దార్లను ఆదేశించారు. హౌసింగ్‌కు సంబంధించి పురోగతి చూపని 153 మంది ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు షోకాజ్ నోటీసులు జారీ చేశామన్నారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ డా.బి. నవ్య, డీఆర్వో వెంకటనారాయణమ్మ, ఇన్‌చార్జి హౌసింగ్ పీడీ చిరంజీవి పాల్గొన్నారు.

డ్రైవర్‌కు అస్వస్థత

- రోడ్డు సైడుకు దూసుకెళ్లిన ఆర్టీసీ బస్సు
- విద్యార్థులకు త్రుటిలో తప్పిన ప్రమాదం

మంత్రాలయం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): డ్రైవర్‌కు మూర్ఛ రావడంతో ఆర్టీసీ బస్సు రోడ్డు సైడుకు దూసుకెళ్లింది. ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో అందులో ఉన్న విద్యార్థులు ఊపిరి పీల్చుకున్నారు. మండలంలోని వి. తిమ్మాపురం గ్రామానికి చెందిన దాదాపు 30 మంది విద్యార్థులను శుక్రవారం ఉదయం బస్సులో ఎక్కించుకొని డ్రైవర్ రామలింగడు ఎమ్మిగనూరు బయలుదేరాడు. మార్గమధ్యంలో డ్రైవర్ రామలింగడుకు మూర్ఛ రావడంతో బస్సు రోడ్డు పక్కనే ఆగి ఉన్న మోటారు సైకిల్‌ను ఢీకొట్టి పొలంలోకి దూసుకెళ్లింది. దీంతో బస్సులో ఉన్న 30 మంది విద్యార్థులు భయాందోళనలకు గురయ్యారు. 108 అంబులెన్స్ సిబ్బంది డ్రైవర్‌ను ఎమ్మిగనూరు ఆసుపత్రికి తరలించారు.

వీడిన అనుమానాస్పద మృతి కేసు మిస్టరీ

మృతుడి భార్య, మరో ఇద్దరి అరెస్టు



నిందితులను చూపుతున్న డీఎస్పీ రవికుమార్

కొలిమిగుండ్ల, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : అనుమానాస్పద మృతి కేసును కొలిమిగుండ్ల పోలీసులు ఛేదించారు. ఇందుకు సంబంధించిన వివరాలను ఆళ్లగడ్డ డీఎస్పీ రవికుమార్ వెల్లడించారు. మండలంలోని పెట్నికోటలో ఈ నెల 26న పామిడి రమేష్ హత్యకు గురయ్యాడు. అయితే పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. వల్లెపు వేణుగోపాల్, వడ్డె నారాయణస్వామి అనే వ్యక్తులతో కలిసి భర్త ముఖంపై తల గడతో అదిమి భార్య రమాదేవి హత్య చేసినట్లు విచారణలో తేలింది. ఇందుకు రమాదేవి వివాహేతర సంబంధమే ఇందుకు కారణమని తెలిసింది. నిందితులను పెట్నికోట సమీపంలో కొలిమిగుండ్ల సీఐ రమేష్‌బాబు అరెస్టు చేశారు. రమాదేవితో పాటు మరో ఇద్దరు ముగ్గురు నిందితులను మీడియా ముందు ప్రవేశపెట్టారు. కార్యక్రమంలో ఎస్ఐ వెంకటేశ్వర్లు, ఏఎస్ఐ గోవిందనాయక్, కానిస్టేబుళ్లు రాజ్‌భాస్కర్, కొండారెడ్డి తదితరులు ఉన్నారు.

అనుమతి లేని ప్రైవేటు ల్యాబ్‌లను సీజ్ చేయాలి

● డీఎంహెచ్‌వో కార్యాలయం ఎదుట ధర్నా

కర్నూలు హాస్పిటల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రి ఎదుట ఉన్న అనుమతి లేని ప్రైవేటు ల్యాబ్‌లను సీజ్ చేయాలని ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు కే. శ్రీనివాసులు, నగర కార్యదర్శి బీసన్న డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం జిల్లా వైద్యఆరోగ్య శాఖ కార్యాలయం ఎదుట అనుమతి లేని డయోగ్నస్టిక్ సెంటర్లపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో ధర్నా చేశారు. డీఎంహెచ్‌వో, కలెక్టర్ ఆఫీసుకు కూతవేటు దూరంలో బుధవారపేటలో ఇటీవల ప్రభుత్వ అనుమతి లేని ప్రైవేటు ల్యాబ్‌లు, డయోగ్నస్టిక్ సెంటర్ల ఏర్పాటు చేసి, కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో పేద రోగులను దోపిడీ చేస్తున్నారని ఆరోపించారు. అనేకసార్లు అనుమతి లేని ల్యాబ్‌లపై చర్యలు తీసుకోవాలని డీఎంహెచ్‌వోలకు వినతి చేసినా, ఎవరూ పట్టించుకోవడం లేదన్నారు. అదే అదునుగా ప్రైవేటు డయోగ్నస్టిక్ సెంటర్లు విచ్చలవిడిగా అర్హత లేని వ్యక్తులతో పరీక్షలు నిర్వహిస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నాయని మండిపడ్డారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా కార్యవర్గ సభ్యులు చంటి, నాగేశ్వరరావు, నగర ఆర్గనైజింగ్ సెక్రటరీ కృష్ణ, నాగరాజు, శివాజీ పాల్గొన్నారు.

రోబోటిక్ గుండె ఆపరేషన్ల వర్క్‌షాపు

● హైదరాబాదు సదస్సుకు

హాజరైన సిటీ సర్జన్ డా. ప్రభాకర్ రెడ్డి



హైదరాబాదులో జరుగుతున్న రోబోటిక్ వర్క్‌షాపులో పాల్గొన్న డా. ప్రభాకర్ రెడ్డి

కర్నూలు హాస్పిటల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): హైదరాబాదులో షరటాన్ హోటల్‌లో జరిగే రెండు రోజుల రోబోటిక్ హార్ట్ సర్జరీ వర్క్‌షాప్‌కు కర్నూలు జీజీహెచ్‌కు చెందిన సీనియర్ సిటీ సర్జన్ డా.సి.ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు. సదస్సులో సిటీ గుండె ఆపరేషన్లను చిన్న కోత ఆపరేషన్ల ద్వారా చేస్తున్నారని, ఇప్పుడు రోబోటిక్ ద్వారా ఆపరేషన్లు చేయడానికి మనదేశంలో కూడా వర్క్‌షాపులు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ప్రస్తుతం ఇండియాలో రోబోటిక్ హార్ట్ సర్జరీలు చేయడానికి రూ.15 నుంచి 20లక్షలు ఖర్చు అవుతుందని ఈసేవలు అందుబాటులోనికి వస్తే చార్జీలు తగ్గే అవకాశం ఉంటుందన్నారు.

మహిళ ఆత్మహత్య

బనగానపల్లె, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలుకూరు గ్రామానికి చెందిన మోసు కాశింబీ (41) శుక్రవారం ఆత్మహత్య చేసుకుంది. కాశింబీని 22 ఏళ్ల క్రితం అదే గ్రామానికి చెందిన మోసు సుబ్రమణ్యంకు ఇచ్చి వివాహం చేశారు. ఇప్పటి వరకు వీరికి సంతానం కలగలేదు. డాక్టర్లకు చూపించినా ఎటువంటి ప్రయోజనం కనిపించలేదు. దీంతో తనకు పిల్లలు పుట్టరన్న మనస్థాపంతో ఇంటిలో పురుగుల మందు తాగింది. బంధువులు గమనించి బనగానపల్లె ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా కోలుకోలేక మృతి చెందింది. కాశింబీ తండ్రి జలజన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు నందివర్గం ఎస్ఐ వెంకటసుబ్బయ్య తెలిపారు.

డీఈవో కార్యాలయ ఏడీగా నాగభూషణం

కర్నూలు ఎడ్యుకేషన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లా విద్యాశాఖ కార్యాలయం ఏడీగా నాగభూషణంను నియమిస్తూ డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. డీఈవో ఆఫీసులో పని చేస్తున్న ఏడీ శ్యామ్యూల్ పాల్ డీఈవోగా ఎఫ్ఏసీ పదోన్నతి పొందడంతో ఏడీ పోస్టు ఖాళీ ఏర్పడింది. విజయవాడ డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్‌లో ఏడీగా పని చేస్తున్న నాగభూషణంకు బదిలీపై పోస్టింగ్ ఇచ్చారు. అలాగే డీఈవో కార్యాలయంలో పని చేస్తున్న ఇద్దరు పర్యవేక్షణాధికారులు రవి కుమార్, రాజశేఖర్‌ను బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. రవికుమార్‌ను అన్నమయ్య జిల్లా విద్యాశాఖ ఆఫీసులో ఇన్‌చార్జి ఏడీగా, అనంతపురం జిల్లాకు రాజశేఖర్‌ను బదిలీ చేశారు.

డిగ్రీ పరీక్షలు ప్రారంభం

కర్నూలు అర్బన్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): రాయలసీమ యూనివర్సిటీ పరిధిలో 3, 4 డిగ్రీ సెమిస్టర్ పరీక్షలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. కర్నూలు, నంద్యాల జిల్లాలోని 61 పరీక్షా కేంద్రాల్లో జరుగుతున్న పరీక్షలను వర్సిటీ ఇన్‌చార్జి ఉపకులపతి, ప్రొఫెసర్ ఎన్‌టీకే నాయక్, పరీక్షల విభాగం అధికారులు పరిశీలించారు.

కొత్త ఇళ్లకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు

● హౌసింగ్ డీఈఈ విజయకుమార్

పత్తికొండ టౌన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): కొత్త ఇళ్ల కోసం గ్రామ సచివాలయాల్లో ఆన్‌లైన్ దరఖాస్తులు చేసుకోవచ్చని హౌసింగ్ డీఈఈ విజయకుమార్ తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ అర్హత కలిగిన వారు కొత్త ఇళ్లు మంజూరు కావాలంటే ఆయా గ్రామ సచివాలయాల్లో తమ సొంత స్థలం ఉన్న వారు, మట్టిమిద్దెలు పడిపోయిన వారు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకున్న లబ్ధిదారులను గుర్తించేందుకు ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, ఏఈలు స్థలాలను పరిశీలించి అర్హత కలిగి ఉంటే.. యాప్ ద్వారా ఆన్‌లైన్‌లో ఇంటి నిర్మాణం కోసం నమోదు చేస్తామని అన్నారు. పీఎంఏవై గ్రామీణ 2.0 ప్రోగ్రాం కింద రూ.1.20లక్షతో పాటు ఎన్ఆర్ఈజీఎస్ కింద రూ.30వేలు హౌసింగ్ కింద నిధులు వస్తాయన్నారు. అలాగే కర్నూలు కుడా, పీఎంఈవై అర్బన్ కింద ఆన్‌లైన్ చేసుకుంటే యూనిట్ కాస్ట్ రూ.2.50 లక్షలు ఇంటి నిర్మాణానికి మంజూరు అవుతాయన్నారు. సొంత స్థలం ఉన్న వారు జియో ట్యాగింగ్ పూర్తి చేసి ఇళ్ల మంజూరుకు ప్రతిపాదనలు పంపిస్తామని, అర్హత కలిగిన వారు కొత్త ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

సైబర్ నేరాలపై జాగ్రత్తగా ఉండాలి: డీఎస్పీ



కరపత్రాలను పంపిణీ చేస్తున్న డీఎస్పీ

ఆదోని రూరల్ నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : సైబర్ నేరాల పట్ల ప్రతి ఒక్కరు జాగ్రత్తగా ఉండాలని డీఎస్పీ సోమన్న సూచించారు. శుక్రవారం మండలంలోని ఢణాపురంలో సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించి కరపత్రాలను పంపిణీ చేశారు. డీఎస్పీ మాట్లాడుతూ ఫోన్లకు ఓటీపీలు, ఫేస్‌బుక్, ఇన్‌స్ట్రా, వాట్సాప్‌లలో వచ్చే లింకులు, నెంబర్లతో గుర్తు తెలియని వ్యక్తులు పంపే సందేశాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ఏదైనా సైబర్ నేరస్థుల పాల్పడితే.. ఎదుర్కోవాలన్నారు.

క్రీడలతో నాయకత్వ లక్షణాలు

● డిప్యూటీ ఈవో వెంకటరమణారెడ్డి



క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న డిప్యూటీ ఈవో వెంకటరమణారెడ్డి

ఆదోని అగ్రికల్చర్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : క్రీడలతో విద్యార్థులు నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవచ్చని డిప్యూటీ ఈవో వెంకటరమణారెడ్డి అన్నారు. శుక్రవారం ఎస్‌కేడీ కాలనీ లీలాస్ పాఠశాల క్రీడామైదానంలో ఆదోని జోనల్ త్రో బాల్ పోటీలను ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ చదువులు ఎంత ముఖ్యమో క్రీడలు కూడా అంతే ముఖ్యమన్నారు. గెలుపోవడటములను సమానంగా తీసుకోవాలని కోరారు. 17టీంలు టోర్నమెంట్‌లో పాల్గొనగా హోరాహోరీగా క్రీడా పోటీలు సాగాయి. కార్యక్రమంలో ప్రిన్సిపల్ ప్రతిభబాయ్, వ్యాయమ ఉపాధ్యాయులు ఈరన్న, ఖలీల్ అహ్మద్, నరసింహులు, సుశీల, రామన్న, నరసింహరాజు, నరసన్న ఆలీ పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన డీఎస్పీ

గూడూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): గూడూరు పోలీస్ స్టేషన్‌ను కర్నూలు డీఎస్పీ బాబు ప్రసాద్ శుక్రవారం తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. కోడుమూరు సీఐ తబ్రేజ్, ఎస్ఐ తిమ్మయ్య ఉన్నారు.

జోరుగా పొగాకు కోతలు

కోడుమూరు రూరల్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ గ్రామాల్లో సాగు చేసిన పొగాకు పంట కోత దశకు చేరుకుంది. దీంతో రైతులు పొగాకు ఆకులను కోస్తూ బిజీగా గడుపుతున్నారు. మండలంలోని గోరంట్ల, అమడగుంట్ల, అనుగొండ, లద్దగిరి, కొత్తూరు, ప్యాలకుర్తి, క్రిష్ణాపురం, వర్కూరు వంటి తదితర గ్రామాల్లో సుమారు 870 హెక్టార్లలో పొగాకు సాగు అయింది. ఈ ఏడాది పొగాకు విస్తీర్ణం గణనీయంగా పెరగడంతో కూలీలకు పనులు దొరుకుతున్నాయి. పొగాకు పంటకు మంచి ధర లభిస్తుండడంతో విస్తీర్ణం పెరిగినట్లు అధికారుల అంచనా. సుమారు 80 రోజుల అనంతరం పొగాకు పంటలో మొదటి దశలో ఆకులను కోత జరిపిస్తున్నారు. ఎకరాకు కోత, ఆకులు కుట్టడానికి 10 మంది అవసరం కాగా ఒక్కో కూలీకి రూ.400 ఇస్తున్నారు. ఆకులను ఎద్దులబండిపై కల్లం చేర్చడానికి రూ.2వేలు బాడుగ


కట్టెల షెడ్డులో ఎండబెట్టిన పొగాకు


పొగాకు దండలు కడుతున్న కూలీలు

అవుతోంది. దీంతో పొగాకు కటింగ్, కోసిన ఆకులను కల్లం చేర్చడం, ఆ ఆకులను మందపాటి దబ్బనంతో దండగా కుట్టడం, దండలను షెడ్‌లో ఆరబెట్టుకోవడం ముమ్మరంగా జరుగుతున్నాయి. రైతులు రాత్రిపూట షెడ్ వద్ద పంట దిగుబడికి కాపలా ఉంటున్నారు.

పెరిగిన ఖర్చులు: పొగాకు పంట సాగుకు పెట్టుబడి ఖర్చులు పెరిగాయని పలు గ్రామాల రైతులు తెలిపారు. ఎకరా సాగులో నారు పెంపకం, గెడం బాడుగ, నాటు కలిపి రూ.8వేలు. మందులు, పిచికారి రూ.6వేలు. 3సార్లు కోతలు, ఆకులు రవాణా, దండలుగా కుట్టడానికి మొత్తం రూ.20వేలు, షెడ్ తయారీ రూ.10 వేలు, బేళ్ల తయారు చేయడానికి రూ.4వేలు ఖర్చు అవుతోందని రైతులు గిడ్డయ్య, మల్లయ్య, తిరుమల్, వెంకటేష్, మధు, బాబయ్య తెలిపారు.

బ్యాడ్మింటన్‌లో ఆర్‌యూ మహిళా జట్టుకు మూడో స్థానం

కర్నూలు స్పోర్ట్స్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 26 నుంచి 28 వరకు వీటీయు బెలగావి ఆధ్వర్యంలో జరిగిన సౌత్‌జోన్ ఇంటర్ యూనివర్సిటీ బ్యాడ్మింటన్ ఉమెన్ టోర్నమెంటులో ఆర్‌యూ బ్యాడ్మింటన్ మహిళా జట్టు మూడో స్థానంలో నిలిచింది. రాజస్థాన్‌లోని జగదీశ్ ప్రసాద్ జబర్మల్ తిబ్రేవాలా విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో డిసెంబరు 3 నుంచి 6వ తేదీ వరకు నిర్వహించే ఆల్ ఇండదియా ఇంటర్ యూనివర్సిటీ బ్యాడ్మింటన్ ఉమెన్ టోర్నమెంటుకు కూడా అర్హత సాధించింది. యూనివర్సిటీ బ్యాడ్మింటన్ మహిళల జట్టు వరుసగా మూడుసార్లు ఆల్ ఇండియాకు అర్హత సాధించింది. ఈ సందర్భంగా ఆర్‌యూ వైస్ చాన్సలర్ ప్రొ. ఎన్‌టీకే నాయక్ శుక్రవారం నంద్యాల రామ కృష్ణ డిగ్రీ కళాశాలకు చెందిన మహిళా జట్టు క్రీడాకారిణులు ఎం.ఆకాం క్ష, ఎస్‌జాహ్నవి, సీహెచ్‌ఎస్ఆర్ ప్రణవి, ఎఫ్ షరీఫ్, ఎల్.మహైఖ్యలను కోచ్, మేనేజర్ హేమంత్ రెడ్డిలను అభినందించారు. వెయిట్ లిఫ్టింగ్ మెన్ టీమ్‌కు క్రీడాదుస్తులను పంపిణీ చేశారు. ఈ నెల 30 నుంచి డిసెంబరు 3 వరకు మెన్స్ టీం గుంటూరులోని ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో నిర్వహించే చాంపియన్‌షిప్‌లో పాల్గొంటారన్నారు. పురుషుల జట్టు సభ్యులు అబ్దుల్లా, పర్వేజ్, వీరేష్, కోచ్ యూసుఫ్‌లను అభినందించారు. రిజిస్ట్రార్ డాక్టర్ విజయకుమార్ నాయుడు, పీడీ అసిస్టెంట్ డైరెక్టర్ కేవీ శివకిషోర్ పాల్గొన్నారు.


మహిళా జట్టుకు కప్పు అందజేస్తున్న ఆర్‌యూ ప్రతినిధులు

క్రీడల్లో రాణిస్తేనే గుర్తింపు


క్రీడాకారులతో డాక్టర్ బి. శంకర్‌శర్మ

కర్నూలు స్పోర్ట్స్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): క్రీడాకారులు క్రీడల్లో రాణిస్తే మంచి గుర్తింపు వస్తుందని సీనియర్ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డాక్టర్ బి. శంకర్‌శర్మ అన్నారు. శుక్రవారం డీఎస్ఏ క్రీడా మైదానంలో జరిగిన ఆట్యా పాట్యా జిల్లా జట్టు క్రీడాకారులకు ఆయన క్రీడాదుస్తులు పంపిణీ చేశారు. డిసెంబరు 1 నుంచి 3వ తేదీ వరకు పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో జరిగే అంతర్‌జిల్లా ఆట్యాపాట్యా క్రీడా పోటీల్లో పాల్గొనేందుకు వెళ్తున్న క్రీడాకారులను డాక్టర్ శంకర్ శర్మ అభినందించారు. కార్యక్రమంలో ఆట్యాపాట్యా సంఘం కార్యదర్శి నాగరత్నమయ్య తదితరులు పాల్గొన్నారు.

వాలీబాల్ పోటీలకు జిల్లా క్రీడాకారులు

కర్నూలు స్పోర్ట్స్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): బాపట్ల జిల్లా సూర్యలంక బీచ్‌లో ఈ నెల 25, 26 తేదీల్లో జరిగిన రాష్ట్ర స్థాయి అండర్-14 బీచ్ వాలీబాల్ పోటీల్లో కర్నూలు జిల్లాకు చెందిన జిల్లా పరిషత్ హైస్కూల్ పులకుర్తి విద్యార్థి కే. రవి, బి.తాండ్రపాడు జడ్పీహెచ్ఎస్ విద్యార్థి టి. శ్రీనివాసులు ప్రతిభ కనబరిచి ద్వితీయ స్థానంలో నిలిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. విద్యార్థులను జిల్లా విద్యాశాఖ అధికారి శ్యామ్యూల్ పాల్ శుక్రవారం తన కార్యాలయంలో అభినందించారు. కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ కార్యదర్శి గిడ్డయ్య, సహాయ కార్యదర్శి డి.సుంకరావు, వ్యాయామ ఉపాధ్యాయులు కేజీ కిషోర్, బిజయ గణపతి పాల్గొన్నారు.

ప్రైవేట్‌కు అప్పగించొద్దు

కర్నూలు ఎడ్యుకేషన్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): కర్నూలు మెడికల్ కళాశాల స్థలాన్ని ప్రైవేట్‌కు అప్పగించొద్దని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రంగప్ప, అబ్బుదుల్లా అన్నారు. శుక్రవారం వారు మాట్లాడుతూ గతంలోనే కళాశాల స్థలాన్ని రోడ్డు వెడల్పు కోసం కేటాయించిందన్నారు. మరి ఇప్పుడు కళాశాలకు సంబంధించిన స్థలాన్ని ప్రైవేట్ షాపులకు అప్పగించడాన్ని తాము వ్యతిరేకిస్తున్నామన్నారు. కళాశాలకు మెరుగైన సౌకర్యాలు కల్పించకపోగా ఉన్న స్థలాన్ని ప్రైవేట్ వ్యక్తులకు ఇస్తామంటే ఎలా అని ప్రశ్నించారు. వారికి ప్రత్యామ్నాయం చూపాలని అన్నారు. అధికారులు ఈ ఆలోచనను విరమించకపోతే ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో మెడికల్ విద్యార్థులను కలుపుకొని ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

పార్కుల్లో వసతులు కల్పిస్తాం: కమిషనర్

కర్నూలు న్యూసిటీ, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): నగర పాలక పరిధిలోని పార్కుల్లో అన్ని రకాల వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని కమిషనర్ ఎస్.రవీంద్రబాబు అన్నారు. శుక్రవారం 42వ వార్డు వాణిజ్యనగర్ పార్కుతోపాటు పరిసర ప్రాంతాల్లో ఆయన పర్యటించారు. ఆయన వెంట శానిటరీ ఇన్‌స్పెక్టర్ యువ రాజు, సిబ్బంది ఉన్నారు.

నేడు పుస్తకావిష్కరణ

కర్నూలు కల్చరల్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): కర్నూలుకు చెందిన ప్రముఖ బాలల కథా రచయిత డాక్టర్ ఎం.హరికిషన్ రాసిన 'చిలక ముక్కు చిన్నోడు' పుస్తకా విష్కరణ చిత్తూరు జిల్లా పలమనేరులో శనివారం జరగనుంది. ఈవిషయం రచయిత హరికిషన్ తెలిపారు. పలమనేరులోని బాలకల గురుకుల పాఠశాలలో పైనేని తులసీ నాథం నాయుడు గారి 'తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి' ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరుగుతుందని ఆయన తెలిపారు.

గంజాయి సాగు చేస్తే జైలుకే: డీఎస్పీ


రికార్డులు పరిశీలిస్తున్న డీఎస్పీ బాబుప్రసాద్

సి.బెళగల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): గంజాయి సాగు చేస్తే జైలు శిక్ష తప్పదని కర్నూలు డీఎస్పీ బాబుప్రసాద్ హెచ్చరించారు. శుక్రవారం స్థానిక పోలీసు స్టేషన్‌లో ఆయన రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ మండలంలో గంజాయి సాగు అధికంగా ఉందని, దానిని నివారించకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. డిసెంబరులో జరగనున్న సాగునీటి సంఘాల ఎన్నికలను ప్రశాంతంగా జరుపుకోవాలన్నారు. ఆయన వెంట కోడుమూరు సీఐ తబ్రేజ్, ఎస్ఐ తిమ్మారెడ్డి, ఏఎస్ఐలు నాగన్న, అంజినేయులు, పోలీసులు ఉన్నారు.

ఎంఏ షరీఫ్‌ను కలిసిన డైరెక్టర్

కర్నూలు అర్బన్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): మైనార్టీ వ్యవహారాల సలహాదారుడు ఎంఏ షరీఫ్‌ను ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ నంద్యాల నాగేంద్ర, మైనార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బషీర్‌లు కలిశారు. సెక్రటే రియట్‌లో ప్రభుత్వ సలహాదారుడిగా బాధ్యతలు తీసుకున్న ఆయనను డైరెక్టర్ హోదాలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు.


ఎంఏ షరీఫ్‌తో ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ నాగేంద్ర

సభ్యత్వ నమోదు వేగవంతం చేయండి: తిక్కారెడ్డి

కర్నూలు అర్బన్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): టీడీపీ సభ్యత్వాలను రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలుపుదామని పార్టీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లా టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలోని 7 నియోజకవర్గాల్లో మంత్రులు, శాసన సభ్యులు, ఇన్‌చార్జిలు సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని వేగవంతంగా చేయాలని కోరారు. జిల్లాలో ఇప్పటికే 1.35 లక్షల సభ్య త్వాలు తీసుకున్నారన్నారు.

ఇన్‌చార్జిలుగా వార్డు అడ్మినిస్ట్రేషన్ సెక్రటరీలు

కర్నూలు న్యూసిటీ, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): నగర పాలక సంస్థ పరిధిలో పని చేస్తున్న 18 మంది వార్డు అడ్మినిస్ట్రేషన్ సెక్రటరీలకు ఇన్‌చార్జిలను నియమిస్తూ అడిషినల్ కమిషనర్ ఆర్‌జీవీ కృష్ణ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు నగర పాలక పరిధిలోని 133 సచివాలయాలకు సంబంధించి 18 సచివాలయాల్లో వార్డు అడ్మినిస్ట్రేషన్ సెక్రటరీలు ఖాళీగా ఉండటంతో పక్కనే ఉన్న సచివాలయాలకు సంబంధించిన సెక్రటరీలను నియమించారు. పరిపాలన సౌలభ్యం కోసం నియమించినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

రాజీ మార్గమే ఉత్తమం: ఎస్ఐ

కోడుమూరు రూరల్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): కేసులతో జీవితాలు దెబ్బతింటాయని, రాజీ మార్గమే ఉత్తమమని ఎస్ఐ శ్రీనివాసులు అన్నారు. ఎస్ఐ మాట్లాడుతూ మెగా లోక్ అదాలత్‌లో భాగంగా బాధితులకు కౌన్సెలింగ్ ఇస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికీ ఐదు కేసులలో ఫిర్యాదిదారులు నిందితులతో రాజీ అయినట్లు చెప్పారు. శుక్రవారం పులకుర్తికి చెందిన అన్నదమ్ములు కేసులో రాజీ అయినట్లు తెలిపారు.

వేరుశనగ విత్తనాలు పంపిణీ

సి.బెళగల్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని బ్రాహ్మణదొడ్డి గ్రామంలోని రైతు భరోసా కేంద్రంలో రైతులకు వేరుశనగ విత్తనాలను వ్యవసాయశాఖ ఏడీ సాలురెడ్డి శుక్రవారం అందజేశారు. ఆయన మాట్లాడుతూ రైతులు ప్రభుత్వం అందజేస్తున్న సబ్సిడీలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏవో మల్లేష్‌కుమార్, ఎంపీఈవోలు భాస్కర్, వెంకటేశ్వర్లు రైతులు పాల్గొన్నారు.

రేపు ఎస్టీయూ జిల్లా వార్షిక కౌన్సిల్ సమావేశం

కర్నూలు ఎడ్యుకేషన్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): స్థానిక సలాం ఖాన్ భవనంలో ఆదివారం ఎస్టీయూ జిల్లా వార్షిక సమావేశం నిర్వహిస్తున్నట్లు సంఘం జిల్లా అధ్యక్షుడు ఎస్.గోకారి, ప్రధాన కార్యదర్శి టి కే జనార్ధన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా మాజీ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి, ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఎల్.సాయి శ్రీనివాస్, ముల్లు రఘునాథ్ రెడ్డి, ఆర్థిక కార్యదర్శి కోటేశ్వరరావు హాజరవుతు న్నారన్నారు.

కాల్వబుగ్గలో నేడు కార్తీక వన భోజనం

- హాజరు కానున్న ప్రముఖులు
- ఏర్పాట్లను పరిశీలించిన నాయకులు, అధికారులు


ఏర్పాట్లను పరిశీలిస్తున్న మల్లెల రాజశేఖర్, పోలీసు అధికారులు

ఓర్వకల్లు, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): కార్తీక మాసాన్ని పురస్కరించుకొని మండలంలోని కాల్వ బుగ్గరామేశ్వర క్షేత్రంలో తెలుగు దేశం పార్టీ ఆధ్వర్యంలో శనివారం వనభోజనం నిర్వహించనున్నారు. టీటీడీ పాలక మండలి సభ్యుడు మల్లెల రాజశేఖర్ పర్యవేక్షణలో జరిగే ఈ కార్యక్రమానికి పలువురు మంత్రులు, ఎంపీ, ఎమ్మెల్యేలు హాజరు కానున్నారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో కార్యక్రమం ఏర్పాట్లను శుక్రవారం మల్లెల రాజశేఖర్, దేవస్థానం ఈవో మద్దిలేటి, కర్నూలు రూరల్ సీఐ చంద్రబాబునాయుడు, ఎస్ఐ సునీల్ కుమార్‌లు పరిశీలించారు. కార్యక్రమంలో నాయకులు కేవీ మధు, సుధాకర్, కాటినేని నారాయణ, నాగభూషణం శెట్టి, అబ్బి, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

కార్తీక వన భోజనానికి తరలిరండి: కాల్వబుగ్గ దేవస్థానం వద్ద ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి సూచనతో కార్తీక వనభోజన కార్యక్రమాన్ని శనివారం నిర్వహించనున్నట్లు టీటీడీ పాలకమండలి సభ్యుడు మల్లెల రాజశేఖర్ తెలిపారు. ఈ కార్యక్రమానికి పాణ్యం నియోజకవర్గంలోని అన్ని మండలాల టీడీపీ నాయకులు, క్లస్టర్, యూనిట్, అర్బన్ వార్డు ఇన్‌చార్జిలు, కార్యకర్తలు తరలిరావాలని కోరారు.

బాధితులకు అండగా టీడీపీ: ఎమ్మెల్యే


చెక్కులు అందుకున్న బాధితులతో ఎమ్మెల్యే దస్తగిరి

కర్నూలు రూరల్ నవంబరు 29(ఆంధ్రజ్యోతి): బాధితులకు తెలుగుదేశం పార్టీ అండగా ఉంటుందని కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి అన్నారు. కర్నూలు, కోడుమూరు, గూడూరు, బెళగల్ మండలాలకు చెందిన కొంతమంది అనారోగ్యాలకు గురై ప్రైవేటు ఆసుపత్రిలో చేరి వేలాది రూపాయలు ఖర్చు చేసుకున్నారు. ఈనేపథ్యంలో బాధితులు సీఎం రిలీఫ్ మంజూరు కోసం దరఖాస్తులు చేసుకున్నారు. దరఖాస్తు దారులంతా కోడుమూరు ఎమ్మెల్యేను ఆశ్రయించడంతో ఆయన విజయవాడలోని రాష్ట్ర ప్రిన్సిపల్ కార్యదర్శితో మాట్లాడి నియోజకవర్గంలో చాలా మంది బాధితులకు ముఖ్యమంత్రి సహాయ నిధిని మంజూరు చేయించారు. మంజూరైన సీఎం రిలీఫ్ చెక్కులను ఎమ్మెల్యే బొగ్గుల దస్త గిరి బాధితులకు అందజేశారు. ఈసందర్భంగా బాధితులు సీఎం చంద్ర బాబుతోపాటు సహకరించిన ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రతి బెడ్‌కు వెంటిలేటర్ ఉండాల్సిందే

కర్నూలు జీజీహెచ్ సూపరింటెండెంట్ కే వెంకటేశ్వర్లు


రోగుల భోజనాన్ని పరిశీలిస్తున్న సూపరింటెండెంట్


కర్నూలు హాస్పిటల్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): ఆర్ఐసీయూ, ఏఎంసీ వార్డుల్లో ప్రతి బెడ్‌కు వెంటిలేటర్ తప్పనిసరిగా ఉండాలని కర్నూలు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ కే వెంకటేశ్వర్లు ఆదేశించారు. శుక్రవారం ఆసుపత్రిలో ఆయన సీఎస్ఆర్ఎంవో డాక్టర్ బీవీ రావు, డిప్యూటీ సీఎస్ఆర్ఎంవో డాక్టర్ బి. హేమనళినితో కలిసి గ్రాండ్ రౌండ్స్ నిర్వహించారు. అత్యవసర విభాగాల్లో వెంటిలేటర్లు, సెక్షన్ ఆపరేటర్లు అన్ని వసతులు ఉండేలా చూసుకోవాలని బయో మెడికల్ ఇంజనీర్‌ను ఆదేశించారు. డైట్ విభాగంలో డాక్టర్ల రిజిస్టర్‌ను పరిశీలించి ఏయే డాక్టర్లు వస్తున్నారు.. వారి వివరాలను అడిగి తెలుసుకున్నారు. రిజిస్టర్‌లో ఆహారం తీసుకున్న వైద్యులందరినీ తనిఖీ చేసి సంతకాలు తీసుకోవాలని డైటీషియన్ రామాంజనేయులును ఆదేశించారు. ఆసుపత్రిలో సెక్యూరిటీ సిబ్బంది సంఖ్యను పెంచాలని ఏజెన్సీని ఆదేశించారు.

ఒకేషనల్ కళాశాల విద్యార్థుల ప్రతిభ


విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్

కర్నూలు ఎడ్యుకేషన్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఒకేషనల్ కళాశాల విద్యార్థులు ఎస్‌జీఎఫ్ 68వ రాష్ట్ర స్థాయి అండర్-19 ఫుట్‌బాల్, త్రోబాల్ పోటీల్లో ప్రతిభ కనబరిచారు. కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతున్న ఎల్.వోసన్న ఈ నెల 23, 24 25 తేదీల్లో త్రోబాల్ పోటీలు విశాఖపట్నం నెరవాడలో జరిగిన పోటీలకు కర్నూలు జిల్లా జట్టు పాల్గొని ద్వితీయ స్థానంలో నిలిచారు. పల్నాడు జిల్లాలోని సత్తెనపల్లిలో జరిగిన రాష్ట్రస్థాయి అండర్- 19 ఫుట్‌బాల్ పోటీల్లో డి.మనోజ్ నాయక్ ప్రతిభ కనబరిచి మూడో స్థానంలో నిలిచారు. వీరిని ప్రిన్సిపాల్ ఎస్.నాగస్వామి నాయక్ అభినందించారు. కార్యక్రమంలో అధ్యాపకులు పాల్గొన్నారు.

'కార్మికుల సమస్యలు పరిష్కరించాలి'



మాట్లాడుతున్న ఎన్ఎంయూ రాష్ట్ర కార్యదర్శి ఇస్మాయిల్

కర్నూలు రూరల్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఎన్ఎంయూ రాష్ట్ర కార్యదర్శి పీఎండీ ఇస్మాయిల్ డిమాండ్ చేశారు. కొత్తబస్టాండ్ సమీపంలోని కేకే భవన్‌లో శుక్రవారం కర్నూలు-2డిపో ఎన్ఎంయూ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈకార్యక్రమానికి వర్కింగ్ ప్రెసిడెంట్ పీఏ వలి అధ్యక్షత వహించగా ముఖ్య అతిథిగా రాష్ట్ర కార్యదర్శి పిఎండీ ఇస్మాయిల్ పాల్గొని ప్రసంగించారు. ప్రభుత్వంలో ఆర్టీసీ విలీనమైన తర్వాత ఉద్యోగుల సమస్యలు నానాటికీ పెరిగాయన్నారు. ఉద్యోగ భద్రత సర్క్యులర్ 1 ఎక్కడా అమలు కావడం లేదన్నారు. గ్యారేజిలో ఎంఎఫ్ కార్మికుల వేధింపులకు గురిచే యడం తగదన్నారు. ఎమ్మిగనూరు డిపోలో డ్యూటీలో గాయపడిన హెల్పర్ వలిని ఆదుకోవాలని అధికారులకు విజ్ఞప్తి చేశారు. సమావేశంలో డిపో అధ్యక్ష, కార్యదర్శులు ఎల్‌బీ కన్న, ఎంఎస్‌బీ రెడ్డి, జిల్లా నాయకులు పి.రంగన్న, పక్రుద్దీన్, మద్దయ్య, కార్మికులు పాల్గొన్నారు.

వంట గ్యాస్ సరఫరాలో.. దోపిడీ

- రూ.50 నుంచి 75 వరకు అధికంగా వసూలు చేస్తున్న వైనం
- పట్టించుకోని అధికారులు





ఆదోని, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : వంట గ్యాస్ సిలిండరు సరఫరాలో అదనపు వసూళ్లు కొనసాగుతున్నాయి. ప్రస్తుతం గృహావసరాల గ్యాస్ సిలిండరు ధర బహిరంగ మార్కెట్‌కు అనుగుణంగా మారుతోంది. ఒక్కో నెలలో పెరుగుతూ, మరో నెలలో తగ్గుతూ ఉండటం వల్ల వాస్తవ ధర వినియోగదారులకు స్పష్టంగా తెలిసే పరిస్థితి లేదు. ఇదే అదును చూసుకొని సిలిండరు ఇంటికి అందించే సమయంలో అదనంగా వసూలు చేస్తున్నారని వినియోగదారులు ఆరోపిస్తున్నారు. ఈ వసూళ్లు చిల్లరగా కనిపించినా.. నెలనెలా ఇది లక్షల్లో సాగుతోంది. ఆదోని పట్టణానికి చెందిన ఓ విశ్రాంత ఉద్యోగి ఇటీవల గ్యాస్ సిలిండరు మీద అదనపు వసూళ్లపై డెలివరీ బాయ్‌ను నిలదీశాడు. వెంటనే ఆ వ్యక్తి.. సిలిండరు ఇవ్వడానికి నిరాకరించాడు. గట్టిగా మాట్లాడితే ఇంటి బయటే సిలిండరు వదిలేశాడు. ఈ విషయం అధికారులకు తెలిసినా ఏమి పట్టనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

● అదనపు డబ్బులు ఇవ్వందే గ్యాస్ సిలిండర్ ఇవ్వరు



ఆదోని నుంచి మా గ్రామానికి వారం రోజులకు ఓసారి ప్రతి మంగళవారం గ్యాస్ సిలండరు సరఫరా చేస్తారు. ఉదయం నుంచి సిలిండర్ కోసం వేచి చూడాల్సిన పరిస్థితి, కూలి పనులు వదులుకొని రోడ్లపై కూర్చోవాలి. బిల్లుపై 874రూపాయలు ఉండగా, రూ.950వసూలు చేస్తున్నారు. అదనంగా 76రూపాయలు తీసుకోని, ఇంటికి కూడా వచ్చి ఇవ్వరు. చాలా ఇబ్బందిగా ఉంది. అధికారులు స్పందించాలి.

– చంద్రశేఖర్, హొళగుంద గ్రామం

● ఎప్పటి నుంచో అక్రమ వసూళ్ల దందా

ఆదోని పట్టణంలో గ్యాస్ సిలిండరు సరఫరా అక్రమ వసూళ్ల దందా ఎప్పటినుంచో సాగుతున్నా.. అధికారులు పట్టించుకున్న దాఖలాలు కనిపించడం లేదు. ఒక వైపు బిల్లులపై ఉన్న ధరకు అదనంగా చెల్లించవద్దని అధికారులు చెబుతున్నారు. మరోవైపు ఇంటికి తీసుకొచ్చే ఏజెన్సీ సిబ్బంది మాత్రం రూ.50 నుంచి రూ.75 వరకూ ప్రాంతాన్ని బట్టి వసూలు చేస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో రూ.75కి తక్కువ కాకుండా వసూలు చేస్తున్నారు. గ్రామాల్లో మహిళలు చాలా మంది దీపం పథకాన్ని వినియోగిస్తున్నారు. వీరికి ఏజెన్సీలు చాలా కిలోమీటర్ల దూరంలో ఉంటున్నాయి. తాము వెళ్లి సిలిండర్లను తెచ్చుకోలేక, ఇంటికి తీసుకొస్తే అదనపు మొత్తం చెల్లించలేక గ్యాస్ వినియోగానికి దూరం అవుతున్నారు.

● ఏజెన్సీలు వాడేసుకుంటున్నాయి..

గోదాం నుంచి వినియోగదారుడి ఇంటి వరకు సిలిండరును చేర్చి, ఖాళీ సిలిండరులను మళ్లీ గోదాంలో చేర్చిందుకుగాను ప్రతి ఏజెన్సీకి సదరు కంపెనీలు రవాణా చార్జీలు చెల్లిస్తాయి. మొత్తాన్ని సిబ్బందికి ఇచ్చి, ఎమ్మార్పీకే సిలిండర్లను సరఫరా చేయాల్సిన బాధ్యత ఆయా ఏజెన్సీలదే. అయితే కంపెనీలిచ్చిన రవాణా చార్జీలను ఏజెన్సీలు వాడేసుకుంటున్నాయన్న ఆరోపణలు ఉన్నాయి. ఏజెన్సీలు తమకు జీతం ఇవ్వడం లేదని, వినియోగదారులనుంచే వసూలు చేసుకోవాలంటున్నారని డెలివరీ బాయ్ ఒకరు తెలిపారు. సొంత వాహనంతో బండ చాకిరి చేస్తూ రూ.30మాత్రమే గ్యాస్ బండకు వసూలు చేస్తున్నట్లు వివరించాడు.



● చర్యలు తీసుకుంటాం

గ్యాస్ డెలివరీ బాయ్స్ సీలిండర్ సరఫరా సమయంలో అదనంగా రూ.50లు నుంచి రూ.70 వసూలు చేస్తున్నారన్న విషయం మా దృష్టికి రాలేదు. లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేస్తే విచారించి చర్యలు చేపడతాం. సంబంధిత వారి లైసెన్సు కూడా రద్దు చేస్తాం.

– రాజా రఘువీర్, జిల్లా సివిల్ సప్లయ్ అధికారి, కర్నూలు.

● ఐదు కిలోమీటర్లు దాటితేనే..

గ్యాస్ సిలిండర్లకు అదనంగా వసూలు చేయవద్దని ఏజెన్సీలకు చెబుతున్నట్లు పౌర సరఫరాల శాఖ అధికారులు పేర్కొంటున్నారు. సిలిండరు డెలివరీ పరిధి ఐదు కిలోమీటర్లలోపు ఉంటే ఉచితమేనని, పైసా కూడా అదనంగా చెల్లించాల్సిన అవసరం లేదంటున్నారు. ఐదు నుంచి 30 కిలోమీటర్ల వరకైతే రూ.10మాత్రమే అదనంగా వసూలు చేస్తారని తెలిపారు. ఏజెన్సీలు, సిబ్బంది వినియోగదారులను ఇబ్బంది పెట్టకూడదని ఇప్పటికే ఆదేశాలు జారీ చేశామని అధికారులు వివరించారు.

● చిల్లరే అయినా.. మొత్తంగా రూ.లక్షల్లో..

ఉమ్మడి జిల్లాలో 39 గ్యాస్ ఏజెన్సీలు ఉన్నాయి. సాధారణ, సీఎస్ఆర్, దీపం కలిపి మొత్తం 6,44,930గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయి. ప్రతి ఇంట్లోనూ గ్యాస్ వినియోగం తప్పనిసరైంది. ఇందులో ప్రతి నెలా క్రమం తప్పకుండా సిలిండరు తీసుకుంటున్న కనెక్షనులు 3లక్షలు వేసుకున్నా.. ఒక్కో వినియోగదారుడి నుంచి సరాసరి రూ.50అదనపు వసూళ్లు అనుకున్నా.. మొత్తంగా 1.5కోట్ల రూపాయలను చెల్లిస్తున్నట్లే. మనం చిల్లరే కదా అని వదిలేసిన మొత్తం ఒక నెలలో రూ. ఒకటిన్నర కోటిపై మాటే..



టీడీపీతోనే గ్రామాల అభివృద్ధి



డీసీ కొండలో సీసీ రోడ్లు పనులను పరిశీలిస్తున్న నాయకులు

తుగ్గలి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): టీడీపీతోనే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని టీడీపీ సీనియర్ నాయకులు ఆదినారాయణ, చిన్న పెద్దయ్య అన్నారు. శుక్రవారం దిగువ చింతలకొండ, డీసీ కొండ, ఉప్పర్లపల్లి తదితర గ్రామాల్లో సీసీ రోడ్లు, మురుగు కాలువల నిర్మాణ పనులను పరిశీలించారు. సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టడంతో గ్రామంలో ఎలాంటి మురుగునీరు రోడ్లపై నిలవదన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు రజాక్, తదితరులు ఉన్నారు.

టీడీపీ కార్యకర్త మృతి



మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పిస్తున్న వీరభద్ర గౌడ్

ఆస్పరి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం ఆస్పరి మేజర్ పంచాయతీ వార్డ్ మెంబరు వీరేష్ తండ్రి బోయ వెంకప్ప (71) శుక్రవారం మృతి చెందాడు. విషయం తెలుగసుకున్న టీడీపీ ఆలూరు నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జీ వీరభద్ర గౌడ్, టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి వైకుంఠం శివప్రసాద్ మృతి దేహంపై పూల మాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కృష్ణ యాదవ్, వెంకటేష్, జీవన్ కుమార్, సతీష్ కుమార్, యుగంధర్, ఎంపీటీసీ నరసప్ప, సుదర్శన్, అటికల్ రాజశేఖర్, యాగంటి రాఘవేంద్ర, అంపయ్య పాల్గొన్నా రు.

ఆంజనేయస్వామి కట్టకు గ్రిల్ ఏర్పాటు



జియో మైసూరు కంపెనీ ప్రతినిధులతో గ్రామస్థులు

తుగ్గలి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): జొన్నగిరిలో ఎంతో ప్రసిద్ధి చెందిన ఆంజనేయస్వామికి కట్ట చుట్టూ గ్రిల్ పనులను జియో మైసూరు కంపెనీ డైరెక్టర్ మానసరంజన్ బిశ్వాల్, పీఆర్వో రామ్మోహన్ సోమిరెడ్డిలు పరిశీలించారు. వారు మాట్లాడుతూ ఆంజనేయస్వామి కట్ట వద్ద చుట్టూ రక్షణ గోడలు గ్రిల్ లేక కట్టపైనే ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వారు అసభ్యకర పనులు చేస్తున్నారని కంపెనీ దృష్టికి రావడంతో స్పందించి రూ.లక్షతో కట్ట చుట్టూ గ్రిల్ వేయించారు. దీంతో ఆ గ్రామస్థులు వారిని సన్మానించి అభినందించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఓబులేసు, మిద్దె రవికుమార్, సొసైటీ సీఈవో గిడ్డయ్య, బాలన్న, బీటీఎస్ రామాంజనేయులు, మీసాల శేఖర్ ఉన్నారు.

పురాతన బావి పరిశీలన



పురాతన బావిని పరిశీలిస్తున్న సర్పంచ్, జియో మైసూరు కంపెనీ ప్రతినిధులు

తుగ్గలి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జొన్నగిరి ప్రధాన కూడళ్లలోని వేణుగోపాల స్వామి ఆలయం వద్ద పురాతన బావిని జియో మైసూరు కంపెనీ ప్రతినిధులు మానసరంజన్ బిశ్వాల్, రామ్మోహన్ సోమిరెడ్డి శుక్రవారం పరిశీలించారు. వారు మాట్లాడుతూ గ్రామానికి నీరు అందిస్తుందంటే వెంటనే ఆ బావిలోని చెత్తా చెదారం తొలగించి, పూడికతీత పనులు చేపడుతామన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మీసాల శేఖర్, జయచంద్ర, అంజి ఉన్నారు.

నగర వాటిక కోసం స్థలాల పరిశీలన



స్థలాలను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్

ఆదోని రూరల్ నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : టూరిజం డెవలప్‌మెంట్‌లో భాగంగా, నగర వాటిక కోసం ఆదోని పరిసర ప్రాంతాల్లో ఉన్న స్థలాలను సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, సిబ్బందితో కలిసి పరిశీలించారు. శుక్రవారం తహసీల్దార్ శివరాముడుతో కలిసి సబ్ కలెక్టర్ మండిగిరి పంచాయతీ పరిధిలో ఉన్న అటవీ, రెవిన్యూ భూములను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు టూరిజం డెవలప్‌మెంట్‌లో భాగంగా, నగర వాటికకు అనువైన స్థలాలను గుర్తిస్తున్నామని సబ్ కలెక్టర్ తెలిపారు.

జగనన్న కాలనీలపై విజిలెన్స్ విచారణ



రైతులను విచారిస్తున్న విజిలెన్స్ అధికారులు

ఆదోని రూరల్ నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : గత వైసీపీ ప్రభుత్వంలో జగనన్న కాలనీ కోసం భూ సేకరణలో జరిగిన అవినీతి అక్రమాలపై విజిలెన్స్ బృందాలు విచారణ వేగవంతం చేశారు. శుక్రవారం ఆదోనిలో జగనన్న కాలనీల కోసం భూములు ఇచ్చిన రైతులతో తహసీల్దార్ కార్యాలయంలో విజిలెన్స్ డీఈఈ చంద్రశేఖర్‌రెడ్డి, విజిలెన్స్ తహసీల్దార్ వెంకటనారాయణ, విజిలెన్స్ అసిస్టెంట్ జియాలజిస్టు సిద్ధయ్య, శ్రీనివాసరెడ్డి, తదితరులు అధికారులు ముఖాముఖీ నిర్వహించి విచారణ చేపట్టారు. మండిగిరి పంచాయతీ పరిధిలో దాదాపు 50మంది రైతుల నుంచి 160 ఎకరాలు గత ప్రభుత్వం జగనన్న కాలనీ కోసం భూసేకరణ చేశారు. అయితే ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి, తన అనుచరులకు ఈ విషయం ముందుగానే తెలియడంతో రైతుల వద్ద నుంచి ఎకరా రూ. 3నుంచి 4లక్షల వరకు కొనుగోలు చేసుకున్నారు. భూసేకరణలో ప్రభుత్వానికి వైసీపీకి చెందిన వారు ఎకరాకు రూ.13.50లక్షలు విక్రయించారని, అంతేకాకుండా కొంతమంది రైతుల ద్వారా అక్రమంగా వైసీపీ బ్రోకర్లు కమీషన్ల రూపంలో వసూలు చేశారని బాధిత రైతులు అధికారులకు తెలిపారు.

పౌష్టికాహారం తీసుకోవాలి

మద్దికెర, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులు పౌష్టికాహారం తీసుకోవడం వల్ల ఆరోగ్యంగా ఉంటారని ప్రభుత్వ వైద్యాధికారి రాగిణి అన్నారు. శుక్రవారం మండలంలోని ఎం.అగ్రహారం గ్రామంలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు రక్తపరీక్షలు, బరువులు నిర్వహించారు.

నైపుణ్యంతోనే ఉద్యోగాలు



ఉద్యోగాలు పొందిన యువతతో స్కిల్ డెవలప్‌మెంట్, న్యాక్ అధికారులు

ఆదోని అగ్రికల్చర్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : నిరుద్యోగ యువతీ యువకుల్లో నైపుణ్యత ఉంటేనే ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని జిల్లా డెవలప్మెంట్ అధికారి ఆనంద్ రాజు కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం ఆర్ట్స్ కళాశాల సమీపంలో న్యాక్ శిక్షణ కేంద్రంలో స్కిల్ డెవలప్మెంట్ ఆధ్వర్యంలో నిర్వహించిన జాబ్ మేళాకు విశేష స్పందన లభించింది. హాజరైన 20 మంది నిరుద్యోగ యువతీ, యువకులను ఎంపిక చేసి ఆయా మల్టీనేషనల్ కంపెనీలో ఉద్యోగ అవకావాలు కల్పించినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో న్యాక్ కేంద్రం ఇన్‌చార్జి ఉలిగన్న, కో ఆర్డినేటర్ రాజశేఖర్ ప్లేస్మెంట్ అధికారి సాయి తేజ, నాన్ టెక్నికల్ ఆఫీసర్ శ్రీనివాసులు, వీరేష్ పాల్గొన్నారు.

దాతలు సహకరించాలి



విరాళాలు సేకరిస్తున్న భక్తులు

మద్దికెర, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): డిసెంబరు 5 నుంచి జరిగే సుబ్రహ్మణ్యం స్వామి షష్టి ఉత్సవాలకు దాతలు సహకరించాలని ఆలయ నిర్వాహకులు విజయప్రసాద్ యాదవ్ అన్నారు. శుక్రవారం మండలంలో సుబ్రహ్మణ్యం స్వామి దేవాలయ నిర్వాహకుల ఆధ్వర్యంలో విరాళాల సేకరణ చేశారు. వారు మాట్లాడుతూ 5 రోజుల పాటు షష్టి ఉత్సవాలు జరుగుతాయని, ఉత్సవాలకు దాతల సహకారం కూడా ఎంతో అవసరమన్నారు.

దరఖాస్తు చేసుకోండి

ఆస్పరి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఉన్న అర్హులైన ప్రతి ఒక్కరూ ఇంటి నిర్మాణాల కోసం దరఖాస్తు చేసుకోవాలని హౌసింగ్ ఏఈ అంజలి శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇల్లు నిర్మించాలని అర్హులైన ప్రతి ఒక్కరికి ఇంటిని నిర్మించాలన్న లక్ష్యంతో ఉందని, కాబట్టి అందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

నీటి సమస్య పరిష్కారం

వెల్దుర్తి, నవంబరు 29(ఆంధ్రజ్యోతి) : స్థానిక బీసీ బాలిక వసతి గృహంలో నీటి సమస్యతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని హాస్టల్ వార్డెన్ శైలజ ఎమ్మెల్యే కేఈ.శ్యాంబాబు దృష్టికి తీసుకెళ్లారు. ఎమ్మెల్యే శ్యాంబాబు ఆదేశాల మేరకు మండల టీడీపీ అధ్యక్షుడు బలరాంగౌడు, యువనాయకుడు రమాకాంతరెడ్డిలు ప్రభుత్వ జూనియర్ కళాశాల సమీపంలో వృథాగా ఉన్న బోరును శుక్రవారం మరమ్మతులు చేయించారు. దీంతో హాస్టల్‌లో నీటి సమస్య తీరింది.

పల్లెల అభివృద్ధే చంద్రబాబు ధ్యేయం

మద్దికెర, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): పల్లెలు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో అభివృద్ధి జరుగుతున్నాయని టీడీపీ నాయకులు బురుజుల చెన్నకేశవులు, తెలుగు యువత నాయకులు కొత్తూరు శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం మండలంలోని బురుజుల గ్రామంలో మాట్లాడుతూ బురుజుల గ్రామానికి రూ.28 లక్షలు సీసీ రోడ్లుకు మంజూరయ్యాయని అన్నారు రోడ్లు నాణ్యత పరిమాణాలు పాటించి ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు.

ముస్లింల సమస్యలు పరిష్కరిస్తా : ఎమ్మెల్యే

ఆదోని టౌన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో అధిక సంఖ్యలో ఉన్న ముస్లింల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని ఎమ్మెల్యే డా పార్థసారథి అన్నారు. శుక్రవారం స్థానిక చారిత్రాత్మక జామియా మసీదులో ముస్లింలతో పాటు ప్రార్థనలలో పాల్గొన్నారు. అనంతరం మాట్లాడు తూ ఈద్గా, షాదీఖానాల నిర్మాణాలను పూర్తి చేయడానికి కృషి చేస్తానని వస్తానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యేకు మసీద్ పెద్దలు గుజరి రవూఫ్, ఖతీబ్ సాబ్ జునైద్ హాష్మీ సన్మానం చేశారు.

సైబర్ ఉచ్చులో పడొద్దు

మంత్రాలయంలో పోస్టర్లు విడుదల చేసిన అధికారులు

మంత్రాలయం, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడొద్దని తహసీల్దార్ ఎస్.రవి, సీఐ రామాంజులు అన్నారు. శుక్రవారం రాఘవేంద్ర సర్కిల్‌లో ఆదోని ఆర్డీవో దీప్తి, ఎస్ఐ పరమేష్ నాయక్, హైవే రోడ్డు ఏఈ సురేష్‌తో కలిసి వారు అవగాహన కరపత్రాలను ఆవిష్కరించారు. ఆటోలు, బస్సులకు ప్రధాన కూడళ్లల్లో వాటిని అతికించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఫోన్లకు ఓటీపీలు, ఫేస్‌బుక్, ఇన్‌స్ట్రా, వాట్సాప్‌లలో వచ్చే లింకులు, నెంబర్లతో గుర్తు తెలియని వ్యక్తులు పంపే సందేశాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో వీఆర్వోలు భీమన్నగౌడు, భీముడు, ప్రభాకర్, డిప్యూటీ తహసీల్దార్ బీకే గురురాజరావు, ఆర్ఐ ఆదాం, రామకృష్ణ, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

ఎమ్మిగనూరు రూరల్: సైబర్ నేరాలపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని ఎమ్మిగనూరు డీఎస్పీ ఉపేంద్రబాబు తెలిపారు. శుక్రవారం కర్నూలు రహదారిలోని బాటమారెమ్మగుడి సమీపంలో ప్రజలకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. కరపత్రాలను పంచారు. కార్యక్రమంలో రూరల్ ఎస్ఐ శ్రీనివాసులు, పోలీసు సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

కౌతాళం: సైబర్ నేరాలపై మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కౌతాళం సీఐ అశోక్ కుమార్ సూచించారు. శుక్రవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో సైబర్ నేరాల నియంత్రణపై అవగాహన పోస్టర్లను సిబ్బందితో కలిసి సీఐ విడుదల చేశారు. కార్యక్రమంలో ఏఎస్ఐ రమణారెడ్డి, హెడ్ కానిస్టేబుల్ సోమ్లు నాయక్, కానిస్టేబుళ్లు నారాయణ, వీరాంజనేయులు, రంగన్న, మోహన్‌రాజు, రామచంద్ర, పులిరాజు ఉన్నారు.

కోసిగి: ప్రస్తుతం సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని కోసిగి సీఐ బీఏ మంజునాథ్, ఎస్ఐ పి.చంద్రమోహన్‌లు అన్నారు. శుక్రవారం కోసిగిలోని తహసీల్దార్ కార్యాలయం, సబ్ రిజిస్ట్రార్, ప్రభుత్వ ఆసుపత్రి, కేజీబీవీ పాఠశాల, నారాయణ కళాశాల తదితర చోట్ల సైబర్ నేరాలపై విద్యార్థులకు, ఉద్యోగులకు, ప్రజలకు అవగాహన కల్పించారు. సైబర్ నేరాలపై కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ నిత్యానందరాజు, సబ్ రిజిస్ట్రార్ బజారి, డా.రజిత, ప్రిన్సిపాల్ షేక్షావలి తదితరులు పాల్గొన్నారు.

పెద్దకడబూరు: సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ నిరంజన్ రెడ్డి అన్నారు. మండల కేంద్రమైన పెద్దకడబూరులోని జిల్లా పరిషత్ హైస్కూల్, తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయాల్లోనూ ఉద్యోగులకు సైబర్ నేరాలపై కరపత్రాలు పంపిణీ చేశారు.


మంత్రాలయంలో పోస్టర్లను విడుదల చేస్తున్న తహసీల్దార్, సీఐ, ఆర్డీవో, ఎస్ఐలు


ప్రజలకు అవగాహన కల్పిస్తున్న డీఎస్పీ ఉపేంద్రబాబు

బాధ్యతగా పని చేయండి

● డీపీవో భాస్కర్
● కోసిగిలోని ఇంటిగ్రేటెడ్ హాస్టల్ అధికారులపై ఆగ్రహం


విద్యార్థులతో మాట్లాడుతున్న డీపీవో భాస్కర్

కోసిగి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ బాధ్యతగా పని చేయాలని డీపీవో భాస్కర్ హెచ్చరించారు. కలెక్టర్‌కు మాజీ ఎమ్మెల్సీ మహ్మద్ ఇక్బాల్ హాస్టల్ పరిసరాలు అపరిశుభ్రంగా ఉన్నాయని, సరైన వసతులు లేవని ఫిర్యాదు చేశాడు. కలెక్టర్ ఆదేశాల మేరకు శుక్రవారం సాయంత్రం డీపీవో కోసిగిలోని ఇంటిగ్రేటెడ్ హాస్టల్‌ను పరిశీలించారు. పరిసరాలు చెత్తాచెదారం, పందులతో నిండి ఉండటంతో అధికారులపై డీపీవో ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాగే హాస్టల్‌లో బాత్‌రూమ్‌లో నీరు లేక దుర్వాసన వెదజల్లుతుండటంతో వార్డెన్ కోటేశ్వరయ్యపై మండిపడ్డాడు. పంచాయతీ ఆధ్వర్యంలో ఇంటిగ్రేటెడ్ హాస్టల్‌కు గేటు ఏర్పాటు చేయాలని, చెత్తాచెదారం హాస్టల్ ఆవరణం ముందు వేయకుండా చూడాలన్నారు. అనంతరం హాస్టల్‌లో అందించే మెనూ భోజనం విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. డీపీవో వెంట జాయింట్ డైరెక్టర్ రంగలక్ష్మిదేవి, తహసీల్దార్ నిత్యానందరాజు, ఎస్ఐ చంద్రమోహన్, ఈవో తిరుమలేశ్వరరెడ్డి, ఏపీవో చంద్రశేఖర్ ఉన్నారు.

సెంట్రల్ లైటింగ్ పనుల పరిశీలన

ఎమ్మిగనూరు, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీనివాసర్కిల్ నుంచి మార్కెట్ కమిటీ రోడ్డులో ఏర్పాటు చేస్తున్న సెంట్రల్ లైటింగ్ పనులను శుక్రవారం మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి పరిశీలించారు. సెంట్రల్ లైటింగ్ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. ఆయన వెంట ఏఈ శరత్‌చంద్ర ఉన్నారు.

టిఫిన్ సెంటర్‌కు రూ.10వేల జరిమానా : పట్టణంలోని పోలీస్ స్టేషన్ ఎదురుగా ఉన్న న్యూ ఉషా టిఫిన్ సెంటర్‌ను శుక్రవారం కమిషనర్ గంగిరెడ్డి తనిఖీ చేశారు. ప్లాస్టిక్ వినియోగిస్తుండడంతో గుర్తించిన ఆయన టిఫిన్ సెంటర్‌కు రూ.10వేల జరిమానా విధించారు. ఆయన వెంట శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు, సిబ్బంది ఉన్నారు.

వైభవంగా పద్మనాభతీర్థుల పూర్వారాధన

● వేలాదిగా తరలివచ్చిన భక్తులు
● వాధిరాజమఠం పీఠాధిపతికి ఘన సన్మానం

మంత్రాలయం, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రాఘవేంద్రస్వామి గురువులైన పద్మనాభతీర్థుల పూర్వారాధన మహోత్సవాలు వైభవంగా నిర్వహించారు. తుంగభద్ర నది ఒడ్డున వెలసిన నవబృందావనంలోని పద్మనాభతీర్థుల మూల బృందావనానికి శుక్రవారం వాధిరాజమఠం పీఠాధిపతి విశ్వవల్లభతీర్థులు, మంత్రాలయం రాఘవేంద్రస్వామి మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు సంయుక్తంగా విశేషంగా క్షీరాభిషేకం, పంచామృతాభిషేకాలు చేసి అక్కడే సంస్థాన పూజలు చేసి మంగళహారతులు ఇచ్చారు. ఉభయ పీఠాధిపతులు భక్తులకు శేషవస్త్రం, ఫలపుష్ప మంత్రాక్షితలు ఇచ్చి ఆశీర్వదించారు. కార్యక్రమంలో ప్రకాషాచార్, ద్వారపాలక అనంతస్వామి, పవనాచార్, శ్రీహరిచార్, సంజీవ కులకర్ణి, వాధిరాజాచార్ తదితరులు పాల్గొన్నారు.


పద్మనాభతీర్థుల బృందావనానికి పూజలు చేస్తున్న ఉభయ పీఠాధిపతులు

రాఘవేంద్రుడి సన్నిధిలో కొత్తూరు పీఠాధిపతి

మంత్రాలయం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): కర్ణాటకలోని కొత్తూరు మఠం పీఠాధిపతి బసవేశ్వర శివాచార్యులు శుక్రవారం మంత్రాలయానికి వచ్చారు. స్వామిజీ కి వేదపండితులు, మఠం అధికారులు స్వాగతం పలికారు. గ్రామదేవత మంచాలమ్మను దర్శించుకుని రాఘవేంద్ర స్వామి మూల బృందావనానికి విశేష పూజలు చేశారు. కార్యక్రమంలో మఠం మేనేజర్లు వెంకటేష్ జోషి, శ్రీపతి ఆచార్, విద్యపీఠం ప్రిన్సిపాల్ రమణరావు పాల్గొన్నారు.


శ్రీమఠంలో బసవేశ్వర శివాచార్యులు

మఠానికి విరాళం: రాఘవేంద్రస్వామి మఠానికి మైసూరుకు చెందిన సైకిల్ బ్రాండ్ అగర్‌బత్తి యజమాని ఆర్ వాసు రూ.లక్ష, చెన్నైకు చెందిన టీ శంకర్ అనే భక్తుడు రూ.3.65 లక్షలు విరాళంగా ఇచ్చినట్లు మఠం ఏఏఓ మాధవశెట్టి, మేనేజరు వెంకటేష్ జోషి తెలిపారు. శుక్రవారం వేర్వేరు సమయాల్లో కుటుంబ సమేతంగా రాఘవేంద్ర స్వామిని దర్శించుకుని విరాళం అందజేశారు. సూపరింటెండెంట్ అనంతపురాణిక్, గిరిస్వామి, నరసింహ ఉన్నారు.

టీడీపీని మరింత బలోపేతం చేయండి

నియోజకవర్గ ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి


రాఘవేంద్రరెడ్డిని సన్మానిస్తున్న కంబలదిన్నె టీడీపీ నాయకులు

మంత్రాలయం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ప్రతి కార్యకర్త టీడీపీ బలోపేతానికి కృషి చేయాలని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని మాధవరంలో పెద్దకడుబూరు మండలంలోని కంబలదిన్నె గ్రామానికి చెందిన ఈరప్పనాయుడు, నాగేంద్ర, శంకర్, ప్రాణేష్ రాఘవేంద్రరెడ్డిని సన్మానించారు. ఈ సందర్భంగా రాఘవేంద్రరెడ్డి మాట్లాడుతూ పార్టీ కోసం కష్టపడి పని చేసే కార్యకర్తను తన ఇంటి సభ్యుడిగా చూసుకుంటానన్నారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు రఘునాథరెడ్డి, రామకృష్ణారెడ్డి, రాకేష్ రెడ్డి, రామకృష్ణ, భీమిరెడ్డి, కేశన్న, రాకేష్ పాల్గొన్నారు.

బాల్య వివాహాలు అరికట్టాలి: తహసీల్దారు

నందవరం, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరు బాల్యవివాహాల నివారణకు కృషి చేయాలని తహసీల్దార్ శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం నందవరంలోని కస్తూర్బాగాంధీ పాఠశాలలో ఆర్డీటీ, మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దారు మాట్లాడుతూ విద్యార్థులు ప్రస్తుత సమాజంలో ఎదురైయ్యే సమస్యలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుధావతి, ఆర్‌డీటీ ఆదినారాయణ, బాబు, ప్రిన్సిపాల్ రంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

క్రిమినల్ కేసు నమోదు చేయాలి

గోనెగండ్ల, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ అనుమతి లేకుండా ఎనిమిదో తరగతి అడ్మిషన్లు చేసుకున్న జీనియస్ గ్లోబల్ స్కూల్‌పై క్రిమినల్ కేసు నమోదు చేయాలని బీసీ ఎస్సీఎస్టీ మైనార్టీ విద్యార్థి సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు భరత్‌కుమార్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ అనుమతి లేని తరగతులకు బోధన చేయడమే గాక అడ్మిషన్ల పేరుతో వేల రూపాయలు పిల్లల తల్లిదండ్రుల దగ్గర వసూళ్లు చేయడం విడ్డూరమన్నారు. పెట్రోల్ బంక్‌ను ఆనుకొని ఉన్న పాఠశాలకు విద్యాశాఖ అధికారులు ఎలా అనుమతులు ఇచ్చారో అర్థం కావడం లేదన్నారు. విద్యాశాఖ నిబంధనలకు వ్యతిరేకంగా నిర్వహిస్తున్న పాఠశాలను సీజ్ చేయాలని డిమాండ్ చేశారు.

చట్టాలపై అవగాహన అవసరం : డీఎస్పీ

గోనెగండ్ల, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): ప్రతి విద్యార్థి చట్టాపై అవగాహన కలిగి ఉండాలని ఎమ్మి గనూరు డీఎస్పీ ఉపేంద్రబాబు అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని పెద్దనేటూరు గ్రామంలోని ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఈసందర్భంగా డీఎస్పీ ఉపేంద్ర బాబు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి కష్టపడి చదివి ఉన్నతస్థాయికి ఎదగాలన్నారు. ప్రతి విద్యార్థి చట్టాలను తెలుసుకోవాలన్నారు. ఈ సందర్భంగా పలు సెక్షనులు, చట్టాలపై అవగాహన కల్పించారు. గ్రామ పెద్దలు డీఎస్పీ, సీఐ గంగాధర్‌ను సన్మానించారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు వీరన్న గౌడ్, బసవరాజుస్వామి, శిల్పి శ్రీనానివాసులు, శేషప్ప నాయుడు, రామాంజినేయులు, గోపాల్, రాముడు, సోమన్న, నారాయణ, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్లను బిగించడం సరికాదు

ఎమ్మిగనూరు రూరల్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్లను బిగించడం సరి కాదని సీపీఐ జిల్లా నాయకులు భాస్కర్‌యాదవ్, రంగన్న అన్నారు. శుక్రవారం పట్టణంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ ముందు ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్లను తొలగిస్తామని చెప్పి నేడు విద్యుత్ వినియోగదారులు ప్రమేయం లేకుండానే బిగించడం సరికాదన్నారు. ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్లను బిగించడంతో రైతులు, చిన్న, మధ్య తరగతి వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు పడతార న్నారు. వెంటనే ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్ల ఏర్పాటుకు స్వస్తి పలకకపోతే ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. అనంతరం టెక్నికల్ ఏఈ వేణుగోపాల్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సమీఉల్లా, కేసీజబ్బార్, దాదావలి, తిమ్మగురుడు, రాజీవ్, మాలిక్, రవి, మన్సూర్, ఇస్మాయిల్, సుంకన్న, వీరేంద్ర పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు

నూతన కార్యవర్గం ఎన్నిక

ఎమ్మిగనూరు టౌన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): జై భీమ్ ఎమ్మార్పీఎస్ ఎమ్మిగనూరు శాఖ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. శుక్రవారం స్థానిక జిల్లా ఉప కార్యాలయంలో ఎమ్మిగనూరు గౌరవ అధ్యక్షుడు పెద్ద నల్లన్న, అధ్యక్షుడు శావల బుజ్జిబాబు, ప్రధాన కార్యదర్శి శావల సత్యానందం, మండల అధ్యక్షుడు నాయకంటి ఆదాము, ప్రధాన కార్యదర్శి నడిమిగేరి నాగరాజును ఎన్నుకు న్నారు. కార్యక్రమంలో వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు చిక్కం జానయ్య, కర్నూలు జిల్లా అధ్యక్షుడు ముత్తు సుమల మాదిగ, చిన్న పోతప్ప, శాంతిరాజు, సురేష్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

జాబ్ మేళాలో 18 మందికి ఉద్యోగాలు

ఎమ్మిగనూరు టౌన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మహాయోగి లక్ష్మమ్మ ప్రభుత్వ కళాశాలలో శుక్రవారం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ నైపుణ్యాభివృద్ధి, శిక్షణ శాఖ వారి ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతీ యువకులకు జాబ్ మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా స్కిల్ అధికారి ఆనంద్ కుమార్, కళాశాల ప్రిన్సిపాల్ మహబూబ్ బాషా మాట్లాడుతూ జాబ్ మేళాలో 18 మంది ఉద్యోగాలకు ఎంపిక అయినట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్లేస్‌మెంట్ ఇన్‌చార్జీ న్యూటన్, కళాశాల సిబ్బంది, స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి సుధాకర్ పాల్గొన్నారు.

పనులు నాణ్యతగా చేపట్టాలి

మంత్రాలయం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): సీసీ రోడ్డు పనులు నాణ్యతగా చేయాలని టీడీపీ నాయకులు అన్నారు. శుక్రవారం రాఘవేంద్రపురం సెల్ టవర్ ఏరియాలో చేపట్టిన సీసీ రోడ్డునిర్మాణ పనులను పంచాయతీ రాజ్ ఏఈఈ మల్లయ్యతో కలిసి టీడీపీ టౌన్ ఇన్‌చార్జి వరదరాజులు, ఎంపీటీసీ మేకల వెంకటేష్ పరిశీలించారు. అదేవిధంగా మాధవరంలో మాజీ సర్పంచ్ రఘునాథరెడ్డి సీసీ రోడ్డు పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో ఇంజనీరింగ్ అసిస్టెంట్ భీమేష్, టీడీపీ నాయకులు అశోక్ రెడ్డి, మేకల నరసింహులు, రాజు పాల్గొన్నారు.

హైవేలపై ప్రమాదాల నివారణకు చర్యలు : ఆర్డీఓ

మంత్రాలయం, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): హైవే రోడ్లపై ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటున్నట్లు ఆదోని ఆర్డీఓ దీప్తి తెలిపారు. శుక్రవారం మంత్రాలయం సీఐ రామాంజులుతో కలిసి చెట్నహళ్లి గ్రామంలో రోడ్డును పరిశీలించారు. ఇక్కడ ప్రమాదాలు అధికంగా జరుగడానికి గల కారణాలపై సమీక్షించారు. వారి వెంట ఎస్ఐ పరమేష్ నాయక్, హైవే రోడ్డు ఏఈఈ సురేష్, రఘు, రామకృష్ణ సోమ్లానాయక్ తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం సక్రమంగా అందించాలి

మంత్రాలయం, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనం సక్రమంగా అందించకపోతే చర్యలు తప్పవని ఎంఈవో రాగన్న హెచ్చరించారు. శుక్రవారం మండలంలోని వగరూరు ఉన్నత ప్రాథమిక, ప్రాథమికోన్నత, వి.తిమ్మాపురం పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనం, విద్యార్థుల హాజరు, విద్యాబోధన, నాడు-నేడు పనులతో పాటు అపార్ ఐడీ జనరేషన్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదవ తరగతిలో వందశాతం ఉత్తీర్ణత ధ్యేయంగా ఉపాధ్యాయులు పని చేయాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్ఎంలు ప్రసాద్, నాగరాజు, వంశీ, మహ్మద్ రఫీ, ఈశ్వర్ రెడ్డి, రవీంద్ర, నాగరాజు పాల్గొన్నారు.

మద్యం స్వాధీనం.. వ్యక్తి అరెస్టు

మంత్రాలయం, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రాఘవేంద్రపురంలో గుంటెప్ప అనే వ్యక్తి అక్రమంగా మద్యం విక్రయిస్తుండగా శుక్రవారం ఎస్ఐ పరమేష్ నాయక్ దాడులు చేసి పట్టుకున్నారు. మద్యం సీసాలను స్వాధీనం చేసుకొని వ్యక్తిని అరెస్టు చేశారు. నిందితున్నీ ఎమ్మిగనూరు కోర్టులో హాజరు పరచగా రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. దాడుల్లో పోలీసు సిబ్బంది మల్లికార్జున స్వామి, రామకృష్ణ, పరమేష్, రాముడు, రఘు పాల్గొన్నారు.

రేపు ఉరుకుందలో లక్ష పుష్పార్చన

కౌతాళం, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రం ఉరుకుంద ఈరన్న స్వామి దేవాలయంలో ఆదివారం అమావాస్య సందర్భంగా స్వామి వారికి లక్ష పుష్పార్చన కార్యక్రమం ఉంటుందని ఆలయ డిప్యూటీ కమిషనర్ విజయరాజు తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రతి అమావాస్య రోజున స్వామి వారికి లక్ష పుష్పార్చన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.